సాక్షి
ఖమ్మం
మంగళవారం । 7 । మే । 2024



కేంద్ర బలగాల అండ

ఎన్నికల వేళ తనిఖీలతో పాటు ప్రజలకు భరోసా కల్పించేందుకు స్థానిక పోలీసులతో పాటు కేంద్రబలగాలు కృషి చేస్తున్నాయి. IIలో



విద్యుత్ శాఖకు రూ.20 లక్షల నష్టం

జిల్లాలో ఆదివారం సాయంత్రం వీచిన గాలిదుమారం కారణంగా విద్యుత్ శాఖకు రూ.20లక్షల మేర నష్టం వాటిల్లింది. IIలో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
40° / 27°

జిల్లాలో మంగళవారం ఉదయం ఉష్ణోగ్రత కాస్త తక్కువగా నమోదయ్యే అవకాశముంది. ఆతర్వాత గంటగంటకు ఎండ పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెరగాలి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని 236 కేంద్రాలకు గాను 78 కేంద్రాల్లో 11,317.720 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున ఎక్కడ కూడా ధాన్యం నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని సూచించారు. అలాగే, రైస్‌మిల్లుల్లో తనిఖీలు చేపట్టి.. సీఎంఆర్ ఎంత, ఇతరత్రా ధాన్యం ఎంత అనేది పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. ఇక రైతులకు నగదు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అగ్ని ప్రమాదాలకు నివారణపై అవగాహన

జిల్లాలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలు పెరుగుతున్నందున, పొలాల్లో పంట వ్యర్థాలు కాల్చకుండా రైతు వేదికల ద్వారా చైతన్యం కల్పించాలన్నారు. ప్రమాదాలపై విచారణ చేపట్టిన కారకులపై కేసులు నమోదు చేయాలని సూచించారు. అలాగే, పిడుగు పడిన సమయాన తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. ఈసమీక్షల్లో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, వివిధ శాఖల అధికారులు సిద్దార్థ్ విక్రమ్‌సింగ్, విజయనిర్మల, సన్యాసయ్య, చందన్‌కుమార్, శ్రీలత, ఆఫ్రిన్ సిద్ధిఖీ, వెంకటరమణ, హరికిషన్, రేమాండ్ బాబు పాల్గొన్నారు.

సైబర్ మోసాల బారిన పడొద్దు

ఖమ్మంక్రైం: పెట్టుబడులు, అధిక లాభాలు, ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట నమ్మించే సైబర్ నేరస్తుల వలలో పడి మోసపోవద్దని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. ఇటీవల ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.లక్షల్లో మోసపోయినట్లు పలువురు సైబర్‌క్రైమ్ పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేస్తున్న నేపథ్యాన కమిషనర్ పలు సూచనలు చేశారు. అపరిచితుల నుంచి వచ్చే లింక్‌లు, మెసేజ్‌లను నమ్మొద్దని తెలిపారు. అలాగే, పార్ట్ టైమ్ ఉద్యోగాలు, టాస్క్‌ల పేరిట కొంత కాలం డబ్బులు ఇచ్చి ఆతర్వాత భారీగా పెట్టుబడి పెట్టించి ముఖం చాటేస్తారని చెప్పారు. ఇలాంటి వారి విషయంలో జాగ్రత్త వ్యవహరించాలని సీపీ సూచించారు. ఇంకా క్రిప్టో కరెన్సీ, ఆన్‌లైన్ పేరిట వచ్చే మెసేజ్‌లకు స్పందిస్తే లాభాలు ఉండకపోగా మోసం ఎదురవుతుందని తెలిపారు. కాగా, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి ఫోన్ చేయడం లేదా cybercrime.gov.in లో రిపోర్ట్ చేయాలని సీపీ ఓ ప్రకటనలో సూచించారు.

అందుబాటులోకి పత్తి విత్తనాలు

ఖమ్మంవ్యవసాయం: వానాకాలం సమీపిస్తున్న వేళ పత్తి విత్తనాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఖరీఫ్‌లో పత్తి పంటే ముందుగా సాగు చేస్తారు. ప్రస్తుతం అకాల వర్షాలు కురుస్తుండడంతో రైతులు దుక్కులు సిద్ధం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో ప్రధాన పంటగా పత్తి సాగు చేయనుండగా ఈ ఖరీఫ్‌లో 2.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని అంచనా. ఈనేపథ్యాన ప్రభుత్వ అనుమతి ఉన్న వివిధ కంపెనీల బీటీ–1, 2 పత్తి విత్తనాలు ఆరు లక్షల ప్యాకెట్ల మేర అందుబాటులో తీసుకొచ్చేందుకు వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తోంది. జిల్లాలోని డీలర్లు ఇప్పటికే 25వేల పత్తి విత్తనాలను తెప్పించినట్లు సమాచారం. బీటీ–1 రకం విత్తనాల ప్యాకెట్ ధర రూ.635, బీటీ–2 ధర రూ.864గా ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు రైతులకు సకాలంలో విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడమే కాక నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా కట్టడి చేయడంపై వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి సారించారు.

జిల్లాకు బస్తర్ రాజు భంజ్‌దేవ్



కమల్‌చంద్రను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: కాకతీయ సామ్రాజ్య వారసుడు, బస్తర్ రాజు కమల్‌చంద్ర భంజ్‌దేవ్ సోమవారం జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఆధ్వర్యాన స్వాగతం పలికారు. అనంతరం కమల్‌చంద్ర మాట్లాడుతూ ఖమ్మం బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తరఫున ఖమ్మంలో ప్రచారం చేయడానికి వచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉప్పల శారద, అల్లిక అంజయ్య, కిరణ్, శ్యాంరాథోడ్, భద్రం, శ్రీదేవి, అంకతి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గొంతునై పోరాడా..



'ప్రజాసేవ చేయాలని రాజకీయాల్లోకి వచ్చా.. రాబోయే కాలంలోనూ సేవ చేయాలనే భావన నాలో ఉంది. నన్ను గెలిపించిన ప్రతీసారి ఖమ్మం జిల్లా, రాష్ట్ర ప్రజల గొంతునై పార్లమెంట్‌లో మాట్లాడా. ప్రజల సమస్యలు పార్లమెంట్‌లో ప్రస్తావనకు రావాలంటే నామ నాగేశ్వరరావుతోనే సాధ్యమవుతుంది. అందుకే ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి. రైతు బిడ్డను, ఖమ్మం బిడ్డనైన నన్ను ఆశీర్వదించాలి. నాపై పోటీకి వచ్చిన వారెవరో ఆలోచన చేయాలి' అని ఖమ్మం లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు కోరారు. సోమవారం నామ 'సాక్షి'కి ఇంటర్వ్యూలో వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే.. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

- కన్న తల్లి ఎంతిష్టమో.. ఖమ్మం అన్నా అంతే
- హైవేల నిర్మాణం, రైల్వే సమస్యల పరిష్కారం నా మార్క్
- సమస్యలపై పార్లమెంట్‌లో పోరాడేదే నేను..
- ఖమ్మం బిడ్డగా, ప్రజాసేవకుడిగా నన్ను ఆశీర్వదిస్తారు..
- కేసీఆర్ హయాంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి

'సాక్షి' ఇంటర్వ్యూలో బీఆర్‌ఎస్ ఖమ్మం అభ్యర్థి నామ నాగేశ్వరరావు

● నా కృషితోనే జాతీయ రహదారులు

నేను ఎంపీ కాకముందు ఖమ్మం లోక్‌సభ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉంది. ఒక్క కిలోమీటర్ రోడ్డు కూడా జాతీయ రహదారి లేదు. ఇవ్వాళ ఖమ్మం జిల్లాలో వచ్చిన ప్రతీ జాతీయ రహదారి నా మార్క్. అప్పట్లో సెంట్రల్‌లో కాంగ్రెస్ ఉన్నా నేను వెంట పడ్డా.. దీనికి సాక్ష్యం పార్లమెంట్‌లో నేను వేసిన ప్రశ్నలు, నేను రాసిన లెటర్లే. జిల్లాలో నేషనల్ హైవేలన్నీ తీసుకొచ్చింది నేనే. జిల్లా అభివృద్ధికి రైల్వే లైన్లు, జాతీయ రహదారులే కీలకమని గుర్తించి రూ.8వేల కోట్ల విలువైన జాతీయ రహదారులు తీసుకొచ్చా. అందులో సూర్యాపేట – ఖమ్మం హైవే పూర్తికాగా.. ఖమ్మం – దేవరపల్లి, నాగ్‌పూర్ రోడ్డు నిర్మాణంలో ఉంది. భద్రాచలం వైపు రోడ్లు కూడా నిర్మాణంలో ఉన్నాయి. 2009లో ఎంపీ కాగానే సొంత డీపీఆర్ తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేశా.

● ప్రజా స్పందనకు భయపడే..

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్రకు ప్రజల నుంచి విపరీతమైన స్పందన వస్తోంది. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో ఆపాలని బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కై 48 గంటల పాటు ఆపారు. మాపై ఆ రెండు పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. వాళ్లే చోటా భాయ్, బడేభాయ్ అంటూ సంబోధించుకుంటున్నారు. కొందరు ఆరోపించినట్లు మేము, బీజేపీ ఒక్కటైతే ఇప్పుడు ఎమ్మెల్సీ కవిత జైలులో ఉండేది కాదు. మమ్మల్ని ఎదుర్కోలేకే తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారు.

● నన్ను బిడ్డగా ఆదరించారు..

ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు నన్ను వారి బిడ్డగా ఆదరించారు. పార్టీలకతీతంగా ఓట్లు వేశారు. నేను రాజకీయాల్లోకి రాక ముందు నుంచే ప్రజలకు సేవ చేస్తున్నా. 1996 నుంచి ప్రజాసేవ ప్రారంభించా. మా నాన్న పేరుతో ట్రస్ట్ పెట్టి.. ఎన్నో సేవా కార్యక్రమాలు చేశా. గత పదేళ్లలో సమస్యలపై పార్లమెంట్‌లో నేను చేసింత పోరాటం మరెవరూ చేయలేదు. దానికి సాక్ష్యం పార్లమెంట్‌లో రికార్డులు ఉన్నాయి. నేను మాట్లాడిన మాటలు చూడండి, నేను సమస్యలపై పోరాడింది చూడండి, ఎన్ని ప్రశ్నలు అడిగానో తెలుస్తుంది.

● ఖమ్మం అంటే పనిచేస్తా..


నాకు కన్నతల్లి అంటే ఎంత ఇష్టమో.. ఖమ్మం జిల్లా అంటే అంత ఇష్టం. ఖమ్మం జిల్లా నుంచి ఢిల్లీ దాక ఎవరైనా వస్తే.. ఏ పార్టీ, ఏ కులం, మతం అని అడగకుండా ఖమ్మం అంటే చాలు చేతనైన పనులు చేసి పెట్టా. అనేక మంది పార్టీలు మారుతున్నారు. నాయకులు ఓట్లు వేయించుకుని పార్టీ మారితే వ్యక్తిగతంగా వారికే నష్టం. పదవుల కోసం పార్టీ మారడం కరెక్ట్ కాదు. అది ఏ పార్టీ అయినా. నన్ను ఇబ్బంది పెట్టాలని మా వారిని కొంటున్నారని సోషల్ మీడియాలో వస్తోంది. అయితే, అమ్ముడు పోయే వారిని ప్రజలు నమ్మరు. నాయకుల మాదిరి వారు మారరు కూడా. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నేతలు, శ్రేణులు కలిసికట్టుగా పనిచేస్తుండగా.. ప్రచారానికి మంచి స్పందన వస్తోంది. ఇదే నా విజయానికి గీటురాయి.

పదేళ్లలోనే అభివృద్ధి..

భద్రాచలం – కొవ్వూరు రైల్వేలైన్ కోసం అనేక పోరాటాలు జరిగాయి. 40 ఏళ్ల నుంచి ఈ డిమాండ్ వింటున్నాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భద్రాచలం నుంచి కొవ్వూరు వరకు రైల్వేలైన్ మంజూరైంది. 2012 రైల్వే బడ్జెట్‌లో పెట్టించాం. బయ్యారం ఉక్కు ప్రైవేటీకరించకుండా పార్లమెంట్‌లో పోరాడి అడ్డుకున్నా. బయ్యారం ఐరన్‌టర్ మైన్స్‌ను కాపాడింది నేనే. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఏపీ పునర్విభజన బిల్లులో ఉన్న పెండింగ్ సమస్యలపై రాబోయే కాలంలో పోరాడుతా. ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి నిధులు తీసుకొచ్చా. మారుమూల గ్రామాల్లోనూ రోడ్లు ఉండేలా చూశాం. అలాగే తాగునీటి సరఫరా ఇప్పుడు మెరుగైంది. గత పదేళ్లలో మా నాయకుడు కేసీఆర్ హయాంలో విపరీతమైన అభివృద్ధి జరిగింది. గ్రామాలైనా, పట్టణాలైనా అభివృద్ధిని ప్రజలు చూసింది ఈ పదేళ్లలోనే. ఇంకా చేయాల్సి ఉంది.

అంతకు మించి...

- జిల్లాలో గణనీయంగా పెరిగిన విద్యుత్ వినియోగం
- గత ఏడాదితో పోలిస్తే మరింత పైకి...
- గృహ వినియోగమే అధికం
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో నిమగ్నమైన విద్యుత్ శాఖ



ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. కొద్ది రోజులుగా కేటాయింపు(కోటా)కు మించి జిల్లాలో వినియోగం నమోదవుతోంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఈ పరిస్థితి నెలకొన్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ ఏడాది యాసంగిలో వర్షాభావ పరిస్థితులతో పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. అక్కడక్కడ బోర్లు, బావుల కింద పంటలు సాగు చేశారు. జిల్లావ్యాప్తంగా 1.85 లక్షల ఎకరాల్లోనే పంటలు సాగవడంతో వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గింది. కానీ ఎండల కారణంగా ఇళ్లలో ఉపకరణాల వాడకం ఎక్కువవడంతో గృహ విద్యుత్ వినియోగం మాత్రం గణనీయంగా నమోదవుతోంది.

మండుతున్న ఎండలు

ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉండగా.. రాష్ట్రంలోకెల్లా జిల్లాలోనే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్ నెలంతా 40–45 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదు కాగా.. ఈనెల 1న ఏకంగా 17 ప్రాంతాల్లో 45 నుంచి 46.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ఏసీలు, కూలర్లు ఉపయోగిస్తుండగా జిల్లాకు కేటాయించిన దానికి కన్నా విద్యుత్ వినియోగం జరుగుతోంది. జిల్లాలో అత్యధికంగా ఖమ్మం టౌన్ డివిజన్‌లో వినియోగం నమోదవుతోందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో రోజుకు 4.73 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరగాల్సి ఉండగా, 5.80 మిలియన్ యూనిట్లుగా నమోదవుతోంది. ఈనెల 1నుంచి 3వ తేదీ వరకు జిల్లా కోటా 14.19 మిలియన్ యూనిట్లు కాగా, 17.24 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగించారు. ఇక 4, 5వ తేదీల్లో అదే పరిస్థితి ఉన్నా 6వ తేదీ సోమవారం కాస్త తగ్గినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ మే నెలంతా ఎండలు మండిపోనుండడంతో విద్యుత్ వినియోగం గరిష్ట స్థాయిలో నమోదవుతుందని అంచనా వేస్తున్నారు.

గత ఏడాదితో పోలిస్తే మరింత

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది విద్యుత్ వినియోగం భారీగా పెరగడానికి వర్షాభావ పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతలే కారణమని తెలుస్తోంది. గత ఏడాది జిల్లాకు కేటాయించిన కోటా కన్నా తక్కువ వినియోగమే నమోదైంది. కానీ ఈసారి అంతకు మించి వాడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో సుమారు 6.60 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. ఇందులో గృహ కనెక్షన్లు 4.75 లక్షలు, వ్యవసాయ రంగంలో 1.13 లక్షలు, వాణిజ్య కనెక్షన్లు 57 వేలు, పరిశ్రమలకు 875 కనెక్షన్లు, ఇతరత్రా 11 వేలకు పైగా ఉన్నాయి. ఇందులో ఈ ఏడాది గృహ కనెక్షన్ల విద్యుత్ వినియోగమే పెరిగినట్లు అంచనా వేస్తున్నారు.

అవాంతరాలు లేకుండా..

పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా జిల్లాలో విద్యుత్ శాఖ అధికారులు అవాంతరాలు లేకుండా సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గడిచిన ఏడాదిలో జిల్లాలోని పమ్మి, అల్లీపురంతో పాటు ఇంకొన్ని ప్రాంతాల్లో నూతన సబ్ స్టేషన్లు నిర్మించారు. అయినా ఖమ్మం నగర విస్తీర్ణం పెరిగి అంతరాయాలు చోటు చేసుకోవడంతో మమతా రోడ్డులోని సబ్ స్టేషన్‌లో 5 ఏవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇక ఏడాది కాలంగా జిల్లాలో 441 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయగా.. అంతరాయం లేకుండా సరఫరాకు అధికారులు కృషి చేస్తున్నారు.

గత ఏడాది, ఈ ఏడాది విద్యుత్ వినియోగం (మిలియన్ యూనిట్లలో)

ఏడాది	మార్చి	ఏప్రిల్
2023	161.40	202.19
2024	175.65	225.19

ఈనెలలో జిల్లా కోటా, వినియోగం (మిలియన్ యూనిట్లలో)

తేదీ	కోటా	వినియోగం
01	4.73	5.65
02	4.73	5.79
03	4.73	5.80

నిరంతర విద్యుత్ సరఫరా



అంతరాయాలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. గతంతో పోలిస్తే ఈ ఏడాది గృహ విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. అయినా ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించి సమస్య తలెత్తకుండా చూస్తున్నాం. ప్రస్తుతం నిత్యం ఒక మిలియన్ యూనిట్ల మేర అదనపు విద్యుత్ వినియోగం నమోదవుతోంది.

– ఏ.సురేందర్, ఎస్‌ఈ, ఎన్పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్

కోడ్ ముగియగానే ఇందిరమ్మ ఇళ్లు



బోనకల్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, హాజరైన పార్టీ శ్రేణులు

- జిల్లాలో కాంగ్రెస్ – కమ్యూనిస్టులు కలిశారు..
- ఇక ఏ పార్టీకీ ఇక్కడ మనుగడ లేనట్లే
- ప్రచార సభల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



చింతకానిలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పక్కన మంత్రి పొంగులేటి, అభ్యర్థి రఘురాంరెడ్డి, తదితరులు

బోనకల్/చింతకాని/ముదిగొండ: రాష్ట్రంలో ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలనే ఉద్దేశంతో ఎన్నికలకు ముందు పినపాకలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టగానే ఎన్నికల కోడ్ వచ్చింది.. ఎన్నికలు ముగియగానే ఎమ్మెల్యేలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ బోనకల్, చింతకాని, ముదిగొండలో సోమవారం నిర్వహించిన రోడ్డు షోల్లో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ తమ ప్రభుత్వాన్ని కదల్చాలని చూస్తే ప్రజల ప్రభుత్వాన్ని కూల్చినట్లేనని చెప్పారు. ఒక్క రూపాయి కూడా వృథా కాకుండా ప్రజలకు మంచి చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ రాజ్యం కొనసాగుతోందని తెలిపారు. త్వరలోనే సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఖమ్మం జిల్లా ప్రజల కాళ్లు కడుగుతామని పేర్కొన్నారు. జిల్లాలో కమ్యూనిస్టులు – కాంగ్రెస్ కలిసి పని చేస్తున్న నేపథ్యాన ఇంకో పార్టీకి ఓటు అడిగేందుకు అవకాశమే లేదన్నారు. తమ కూటమికి టీడీపీ మద్దతు కూడా ఉందని తెలిపారు. కాగా, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఒక్క సీటు కూడా గెలిచే పరిస్థితి లేదని భట్టి వెల్లడించారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రధానిగా మళ్లీ మోదీ వస్తే దేశంలో ప్రజాస్వామ్యం ఉండదని, రిజర్వేషన్లు రద్దవుతాయని తెలిపారు. నామను గెలిపిస్తే మంత్రిగా చేస్తానని కేసీఆర్ చెప్పడం గర్హనీయమన్నారు. పదేళ్లలో దేశాన్ని మోదీ, రాష్ట్రాన్ని కేసీఆర్ దోచుకున్నారని.. ఈ ఎన్నికల్లో వారికి ఓటుతో గుణపాఠం చెప్పాలని.. తద్వారా రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతుల కోసం ఆగస్టు 15 నాటికి రూ.2 లక్షల రుణమాఫీ చేయబోతున్నారని వెల్లడించారు. ఈకార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నాయకులు రాయల నాగేశ్వరరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, భాగం హేమంతరావు, పోతినేని సుదర్శన్, అంబటి వెంకటేశ్వర్లు, పావులూరి మల్లికార్జున్‌రావు, మడుపల్లి గోపాలరావు, కొమ్మినేని రమేష్‌బాబు, బుల్లెట్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల కమిషనింగ్ పూర్తి



సత్తుపల్లిలో ఈవీఎం కమిషనింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికలకు కావాల్సిన ఈవీఎం యంత్రాల కమమిషనింగ్ సోమవారం పూర్తయిందని ఖమ్మం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ. గౌతమ్ వెల్లడించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ సంజయ్ జి.కోల్తేతో కలిసి ఖమ్మం రూరల్ మండలంలోని పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల కమిషనింగ్‌ను ఆయన పరిశీలించారు. ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గానికి 355, పాలేరుకు 290 ఈవీఎంల కమిషనింగ్ చేపట్టామని తెలిపారు. ఏఆర్‌ఓలు ఆదర్శ్‌సురభి, ఎం.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్లలో జాగ్రత్త

వైరా/సత్తుపల్లిటౌన్: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఖమ్మం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌తో పాటు సత్తుపల్లి జ్యోతినిలయంలో పాఠశాలలో ఈవీఎంల కమిషనింగ్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా వైరాలో మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పారదర్శకంగా, సాఫీగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే, సత్తుపల్లిలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 294 పోలింగ్ కేంద్రాలకు కావాల్సిన బ్యాలెట్ యూనిట్ల కమిషనింగ్‌లో పొరపాట్లకు తావులేకుండా చూడాలని తెలిపారు. ఆతర్వాత తహసీల్, ఐకేపీ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, ఆర్డీఓ రాజేందర్‌గౌడ్, ఏసీపీ రఘు, ఏఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ యోగేశ్వరరావు, నాయబ్ తహసీల్దార్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేసిన 5,964మంది



ఖమ్మం సహకారనగర్: ఖమ్మం లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఉద్యోగులు సోమవారం నాటికి 3,633 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. అలాగే, 85 ఏళ్ల పైబడిన వయోవృద్ధులు, దివ్యాంగులు, అత్యవసర సేవలకు సంబంధించి ఉద్యోగులు 2,331మంది ఓటు వేశారు. మొత్తంగా ఇప్పటి వరకు 5,964 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు.

పట్టభద్రుల స్థానానికి 13మంది నామినేషన్లు

నల్లగొండ: ఖమ్మం – వరంగల్ – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి ఐదో రోజైన సోమవారం 13 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ నుంచి ఏనుగుల రాకేష్‌రెడ్డి, టీడీపీ నుంచి ముండ్ర మల్లికార్జునరావు, ధర్మ సమాజ్ పార్టీ నుంచి బరిగల దుర్గాప్రసాద్, నేషనల్ నవక్రాంతి పార్టీ నుంచి కర్ని రవి సమర్పించారు. అంతేకాక స్వతంత్రులుగా పులిపాక సుజాత, చీదల్ల వెంకట సాంబశివరావు, చీదల్ల ఉమామహేశ్వరి, తాడిశెట్టి క్రాంతికుమార్, అయితగోని రాఘవేంద్ర, బక్క జడ్సన్, బుగ్గ శ్రీకాంత్, పాలకూరి అశోక్‌కుమార్, దేశగాని సాంబశివరావు తమ నామినేషన్లను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సీహెచ్.మహేందర్‌కు అందజేశారు.



జిల్లా కేంద్రంలో ఆకాశం సోమవారం సాయంత్రం అరుణ వర్ణంలోకి మారింది. రోజంతా ఎండ ప్రభావం ఉండగా సాయంత్రం అయ్యేసరికి గాలిదుమారంతో వాతావరణం కాస్త చల్లబడింది. ఇంతలోనే ఆకాశం పూర్తిగా ఎరుపు రంగును సంతరించుకోవడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించడమేకాక సెల్‌ఫోన్ కెమెరాల్లో బంధించారు. అయితే, ఆకాశం నిప్పులు కురిపిస్తున్నట్లు ఎర్రబడినా ఆదివారం మాదిరి గాలిదుమారం ప్రభావం లేకపోవడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

క్లుప్తంగా

కాంగ్రెస్‌లోకి మధిర మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు



కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లతో డిప్యూటీ సీఎం భట్టి

మధిర: మధిర మున్సిపాలిటీ వైస్ చైర్మన్ సహా ఆరుగురు కౌన్సిలర్లు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. బోనకల్ మండలం రాయన్నపేటలో జరిగిన సమావేశంలో వారు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమక్షాన హస్తం కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శీలం విద్యాలత వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు మల్లాది వాసు - సవిత, గద్దల మాధురి నాని, మేడికొండ కల్యాణి కిరణ్, ధీరావత్ మాధవి ఉన్నారు. అంతేకాక బీఆర్ఎస్ నాయకులు కరివేద సుధాకర్, గూడేల్లి నాగరాజు, మిషన్ భగీరథ తెలంగాణ కార్మిక సంఘం నాయకుడు గద్దల రాజా కూడా కాంగ్రెస్‌లో చేరారు.

నేడు హీరో వెంకటేష్ ప్రచారం

ఖమ్మంవన్‌టౌన్: సినీ హీరో వెంకటేష్ మంగళవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థి, తన వియ్యంకుడు రామసహాయం రఘురాంరెడ్డి తరుపున ప్రచారంలో పాల్గొననున్నారు. సాయంత్రం 5గంటలకు ఖమ్మం మయూరి సెంటర్ నుండి ఇల్లెందు క్రాస్‌రోడ్డు వరకు జరిగే రోడ్డుషోలో ఆయన పాల్గొంటారు. ఆతర్వాత కొత్తగూడెం క్లబ్‌లో జరిగే పుర ప్రముఖుల సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారని కాంగ్రెస్ నాయకుడు తుంబూరు దయాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా బాలకృష్ణ

ఖమ్మం లీగల్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ హ్యూమన్ రైట్స్, ఆర్‌టీఐ విభాగం వైస్ చైర్మన్‌గా వైరా మండలం గండగలపాడుకు చెందిన న్యాయవాది సూర్యదేవర బాలకృష్ణ నియమితులయ్యారు. అలాగే, ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడుకు చెందిన న్యాయవాది నూతలపాటి అప్పారావును నియమించారు. ఈమేరకు రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ సోమవారం వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈమేరకు బాలకృష్ణ, అప్పారావును పలువురు న్యాయవాదులు అభినందించారు.

పాఠశాలలకు రూ.లక్ష విరాళం



విరాళం అందజేసిన పూర్వవిద్యార్థులతో హెచ్‌ఎంలు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని ఎస్‌బీఎస్ బాలుర పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు 1981-82 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.50వేల చొప్పున రూ.లక్ష విరాళాన్ని సోమవారం అందజేశారు. ఈ నిధులను ఫిక్స్ చేసి వచ్చే వడ్డీతో పదో తరగతి మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుధాకర్, కె.మల్లికార్జున్, గంగిశెట్టి ప్రసాద్, హెచ్‌ఎంలు యాకూబ్, ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.25 లక్షల నగదు స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మం త్రీటౌన్ పరిధిలోని ముగ్గురు వ్యాపారుల వద్ద రూ.25లక్షల నగదును సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు లేకుండా వ్యాపారులు వేర్వేరుగా నగదు తీసుకెళ్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు నర్తకి థియేటర్ సమీపాన చేపట్టిన తనిఖీల్లో గుర్తించారు. ఈమేరకు నగదును త్రీటౌన్ పోలీసులకు అప్పగించగా వారు సీజ్ చేశారు.

వ్యాపారి వద్ద రూ.1.72 లక్షలు...

నేలకొండపల్లి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఓ వ్యాపారి వద్ద రూ.1.72లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని కోనాయిగూడెం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల సమీపాన సోమవారం స్పెషల్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టింది. ఈసందర్భంగా చెన్నారానికి చెందిన వ్యాపారి సరైన పత్రాలు లేకుండా రూ.1.72 లక్షలు తీసుకెళ్తుండగా సీజ్ చేశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,075	2,075
పెసలు	8,050	4,000
కందులు	11.102	4,500
అలసంద	7,850	7,850
మిర్చి	18,000	10,500
మిర్చి తాలు	10,000	6,000
పత్తి	7,150	4,000

- ఖమ్మం వ్యవసాయం

కేంద్ర బలగాల అండ..

- ఎన్నికల నిర్వహణలో కీలకం
- స్థానిక పోలీసులతో కలిసి తనిఖీలు.. ఫ్లాగ్‌మార్చ్
- జిల్లాకు మూడు కంపెనీల సీఐఎస్‌ఎఫ్ బలగాలు



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది, పోలీసులు

ఖమ్మంక్రైం: మండుటెండ.. భారీ వర్షం.. గజగజ వణికించే చలిలోనూ విధులు నిర్వర్తించడం కేంద్ర సాయుధ బలగాలను వెన్నతో పెట్టిన విద్య. ఖమ్మం లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన నెల క్రితం ఖమ్మం వచ్చిన కేంద్ర సాయుధ బలగాలు లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని చెక్‌పోస్టుల వద్ద స్థానిక పోలీసులతో కలిసి విధులు నిర్వర్తిస్తున్నారు. అంతేకాకుండా సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ ద్వారా స్థానికులకు భరోసా కల్పిస్తున్నారు.

కీలక పాత్ర

గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలే కాక ఈనెల 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికలులు సజావుగా సాగడంలో స్థానికులు పోలీసులు ఎంత కీలకమో సాయుధ బలగాలూ అందే కీలకపాత్ర పోషిస్తాయి. ఇక్కడి పోలీసులతో పాటు విధులు నిర్వర్తిస్తూ ఎలాంటి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పర్యవేక్షిస్తాయి.

జిల్లాకు మూడు కంపెనీలు

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగానే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి మూడు కంపెనీల సీఐఎస్‌ఎఫ్(సెంట్రల్ ఇండ్రస్ట్రియల్ ఫోర్స్) బాలగాలను జిల్లాకు చేరుకున్నాయి. వీరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా, అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల్లో 24గంటలపాటు స్థానిక సిబ్బందితో కలిసి విధులు నిర్వర్తిస్తూ నగదు, మద్యం అక్రమ రవాణాను అరికట్టడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. అలాగే, సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తూ ఓటర్లలో మనోధైర్యాన్ని పెంచుతున్నారు. వీరంతా అసిస్టెంట్ కమాండెంట్ ఆధ్వర్యాన విధులు నిర్వర్తిస్తుండగా సిబ్బందికి ఖమ్మం పోలీసు కమిషనర్ సీపీ సునీల్‌దత్ ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేస్తున్నారు. కాగా, రెండు, మూడు రోజుల్లో మరో మూడు కంపెనీల బలగాలు రానుండగా పోలింగ్ రోజు బందోబస్తు విధుల్లో పాలుపంచుకోనున్నారు.



వాహన తనిఖీల్లో సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్

ఆడపడుచులకు అండగా ఉంటాం..



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్రంలోని ఆడపడుచులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, సంక్షేమ పథకాలు అమలుచేస్తూ మహిళల ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మంలో సోమవారం మహిళా కాంగ్రెస్ జిల్లాస్థాయి ఆత్మీయ సమ్మేళనం జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య అధ్యక్షతన నిర్వహించగా.. పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇప్పటికే అందిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలు మహిళల కోసం అమలుచేయనున్నట్లు చెప్పారు. కాగా, బీజేపీ మతం, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతుండగా, ఆ పార్టీ మళ్లీ గెలిస్తేనియంతపాలన వస్తుందని తెలిపారు. ఈమేరకు కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డిని గెలిపించి ప్రధానిగా రాహుల్‌గాంధీ ఎంపికకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

● **ఖమ్మం సహకారనగర్:** ఎన్నికల కోడ్ ముగియగానే ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మంలో పీఆర్‌టీయూ టీఎస్ విశ్రాంత ఉపాధ్యాయుల ఫోరం కన్వీనర్ మోతుకూరి మధు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక ప్రయోజనాలపై దృష్టి సారిస్తామని, ముఖ్యమంత్రితో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీలు మోహన్‌రెడ్డి, పూల రవీందర్ మాట్లాడగా మోతుకూరి మధు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న క్రమాన రిటైర్డ్ ఉద్యోగులంతా రఘురాంరెడ్డికి మద్దతు ఇస్తామని తెలిపారు. ఈసమావేశాల్లో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, పగడాల మంజుల, విజయబాయి, మహ్మద్ జావీద్, బాలసాని లక్ష్మీనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయులు దామోదర్‌రెడ్డి, దుర్గారావు, చంద్రశేఖర్, వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

● **ఖమ్మంమయూరిసెంటర్:** సెక్యులరిజం, ప్రజా స్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు కోరారు. రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసిన బీజేపీ మరోమారు గెలిస్తే మరింత ప్రమాదమని తెలిపారు. కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి రామసహయం రఘురాంరెడ్డి సోమవారం ఖమ్మంలోని సీపీఐ కార్యాలయానికి ఆ పార్టీ నాయకుల మద్దతు కోరారు. ఈ సందర్భంగా మహ్మద్ మౌలానా అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ పోరాటాలకు నెలవైన ఖమ్మంలో వామపక్షాల మద్దతుతో కాంగ్రెస్ గెలుపు ఖరారైనప్పటికీ.. అత్యధిక మెజార్టీ సాధనకు కమ్యూనిస్టుల సత్తా చాటాలని సూచించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు జమ్ముల జితేందర్ రెడ్డి, యర్రా బాబు, జానీమియా, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, బీ.జీ.క్లైమెంట్, మహ్మద్ సలాం, స్వర్ణకుమారి, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

అటకెక్కిన కాంగ్రెస్ హామీలు

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అటకెక్కించిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని పలు డివిజన్లలో సోమవారం ఏర్పాటుచేసిన ఆయన రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌ల్లో ఆయన మాట్లాడారు. పద్నాలుగేళ్ల అలుపెరుగని పోరాటం చేసిన కేసీఆర్ తెలంగాణను సాధించారని తెలిపారు. ఆపై అధికారంలోకి వచ్చాక ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయగా.. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే పథకాలను గాలికి వదిలేసిందని ఆరోపించారు. పింఛన్ పెంచకపోగా, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం హామీ ఏమైందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక బీఆర్ఎస్ అధికారంలో ఉన్నన్నాళ్లు తాగునీటి సమస్య లేదని, కానీ ఇప్పుడు నగరంలో ఎక్కడ చూడసినా వాటర్ ట్యాంకర్లు తిరుగుతున్నాయని తెలిపారు. ఈమేరకు లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నామను గెలిపించి కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని పువ్వాడ కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు బుర్రి వెంకట్, పగడాల శ్రీవిద్య, శీలంశెట్టి వీరభద్రం, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖకు రూ.20 లక్షల నష్టం

- గాలివానకు విరిగిన స్తంభాలు, కూలిన ట్రాన్స్‌ఫార్మర్లు
- పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమైన ఉద్యోగులు



గుదిమళ్లలో విరిగిపడిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతు చేస్తున్న ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: ప్రకృతి వైపరీత్యంతో జిల్లాలో విద్యుత్ శాఖకు రూ.20 లక్షల మేర నష్టం వాటిల్లిందని ఆ శాఖ అధికారులు గుర్తించారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో అకాల వర్షం కురవగా.. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. అలాగే, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలడంతో పాటు విద్యుత్ లైన్లు తెగిపోయాయి. ఇక పండిళ్లపల్లి, ధంసులాపురం మధ్య 33 కేవీ టవర్లు ధ్వంసం కావడంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ మేరకు 205 స్తంభాలు కూలిపోగా, 13 డీటీఆర్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో సంస్థకు రూ.20 లక్షల నష్టం వాటిల్లిందని అధికారులు తేల్చారు. సోమవారం నాటికి ఇందులో పలు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేసి సరఫరా పునరుద్ధరించారు. ఖమ్మం ఎస్ఈ ఏ.సురేందర్ పర్యవేక్షణలో ఉద్యోగులు యుద్ధప్రాతిపాదికన మరమ్మతులు చేస్తున్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విద్యుత్ సమస్యలు తెలుసుకునేందుకు జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటుచేసినట్లు ఎస్ఈ తెలిపారు. వైర్లు తెగిపడినా, సమస్య తలెత్తినా సమస్యల 94408 11525 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

పంట నష్టంపై నివేదిక ఇవ్వండి

ప్రకృతి వైపరీత్యంతో జరిగిన పంట నష్టంపై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించారు. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో జిల్లాలో కోత దశలో ఉన్న మామిడి, బొప్పాయి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పలుచోట్ల వరి, మొక్కజొన్న పంటలు కూడా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఈనేపథ్యాన నష్టంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించగా ఇప్పటికే ప్రాథమిక నివేదిక రూపొందించిన అధికారులు మంగళవారం నుంచి సర్వే చేయాలని నిర్ణయించారు.

ఖమ్మం బస్టాండ్‌లో వడదెబ్బతో సొమ్మసిల్లిన మహిళ



మహిళకు చికిత్స చేస్తున్న గిరిసింహారావు

ఖమ్మంమయూరిసెంటర్: ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని ఆర్టీసీ సీనియర్ వైద్యాధికారి ఏ.వీ.గిరిసింహారావు సూచించారు. ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ఓ మహిళా ప్రయాణికురాలు సోమవారం ఉదయం వడదెబ్బకు గురై సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో బస్టాండ్ ఆస్పత్రిలో విధుల్లో ఉన్న గిరిసింహారావు ఆమెకు వైద్యసేవలందించి మాట్లాడారు. ఉదయం 11నుండి సాయంత్రం 5 గంటల వరకు అత్యసరమైతేనే తప్ప ప్రజలు బయటకు రావొద్దని తెలిపారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణుల విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

గేదె నరకయాతన



చెరువు గాడిలో ఇరుక్కపోయిన గేదె

నేలకొండపల్లి: వేసవిలో గొంతు తడుపుకునేందుకు వెళ్లి చెరువు గాడిలో ఇరుక్కుపోయి ఓ గేదె రెండు రోజుల పాటు నరకయాతన అనుభవించింది. మండలంలోని చెరువుమాధారం చెరువులో రైతులు తీసిన గాడి కాల్వలో ఓ గేదె ఇరుక్కపోయింది. మంగాపురంతండా రైతుకు చెందిన గేదె రెండు రోజుల క్రితం నీరు తాగేందుకు వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకోగా అటువైపు ఎవరూ వెళ్లకపోవడంతో చూడలేదు. సోమవారం గ్రామానికి చెందిన రైతులు గమనించి ట్రాక్టర్లకు తాళ్లు కట్టి గేదెను బయటకు తీశారు.

సుబాబుల్ తోటలో మంటలు

మధిర: మండలంలోని ఖమ్మంపాడులో రైతు వెలగా వెంకటేశ్వరరావు చెందిన చేలోని సుబాబుల్ తోట దగ్ధం కాగా, సమీపంలోని పొలాలకు సైతం మంటలు అంటుకున్నాయి. అగ్నిమాప క సిబ్బంది మంటలు ఆర్పి నా మళ్లీ మొదలుకావడంతో రైతుల్లో నెలకొంది. ఈమేరకు కల్యాణలక్ష్మి నారాయణ తదితరుల పొలాలకు మంటలు వ్యాపించగా అప్పటికే నీళ్లు అయిపోవడంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది మళ్లీ వెళ్లి నీళ్లు నింపుకుని వచ్చి మంటలు అదుపు చేశారు.

రైలునుంచి పడి వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మధిర: జిల్లాలోని తొండల గోపవరం - మధిర రైల్వేస్టేషన్ల మధ్య ఆదివారం అర్ధరాత్రి రాత్రి గుర్తు తెలియని వ్యక్తి(35) రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. ఆయన వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు జీఆర్పీ మధిర ఔట్‌పోస్ట్ ఇన్‌చార్జ్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మృతుడికి ఆచూకీ తెలిసిన వారు 87126 58589, 87126 58607 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సంప్ గోడ కూలి వ్యక్తి...

కూలీ కోసం వచ్చిన కుటుంబంలో విషాదం

సత్తుపల్లిరూరల్: నిర్మాణంలో ఉన్న సంప్ గోడ కూలి పడడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా కామరాజుపేటకు చెందిన శ్రీకాకుళపు శ్రీరామమూర్తి(45) యాతాలకుంటలోని సీతారామ ప్రాజెక్టు టన్నెల్ ఓబీ పనుల్లో కూలీగా వచ్చాడు. ఈక్రమంలో సోమవారం ఉదయం గది వద్ద బ్రష్ చేస్తూ ఆదివారం నిర్మించిన నీటి సంపు గోడ వద్ద నిలబడగా అది కూలిపడింది. దీంతో శ్రీరామమూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య ధనలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉండగా.. ఘటనపై సత్తుపల్లి సీఐ టి.కిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

ఎర్రుపాలెం: మండలంలోని పెద్దగోపవరానికి చెందిన రాసమంటి వెంకటకృష్ణ(45) వడదెబ్బతో మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం ఆయన మృతి చెందగా సోమవారం విషయం వెలుగుచూసింది. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం... పశువుల కాపరిగా పనిచేస్తున్న వెంకటకృష్ణ ఆదివారం ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు వెతుకుతుండగా, సోమవారం ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ సమీపాన కొందరు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో మృతదేహం వెంకటకృష్ణదిగా గుర్తించి కుటుంబీకులకు తెలిపారు.

ఖమ్మంలో వృద్ధురాలు..



సోమారపు వెంకటమ్మ (ఫైల్)

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం త్రీటౌన్ ప్రకాష్‌నగర్‌కు చెందిన సోమారపు వెంకటమ్మ (85) వడదెబ్బతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఈమేరకు చాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యులు సోమవారం ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించి వెంకటమ్మ కుమారుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ దిగుమతి శాఖ కార్యవర్గ సభ్యుడు సుధీర్‌కుమార్‌ను పరామర్శించారు. చాంబర్ గౌరవ అధ్యక్షుడు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు..

ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్‌కు చెందిన సీపీఐ నాయకుడు జి.లక్ష్మయ్య(75) వడదెబ్బతో సోమవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈమేరకు సీపీఐ నాయకులు దండి సురేష్, పుచ్చకాయల కమలాకర్ తదితరులు లక్ష్మయ్య మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు.

సీపీఎం నాయకురాలు, శతాధిక వృద్ధురాలు...

ఖమ్మంరూరల్: మండలంలోని ఎం.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన సీపీఎం నాయకురాలు, శతాధిక వృద్ధురాలు లింగనబోయిన పెద్దపుల్లమ్మ(103) సోమవారం మృతి చెందింది. ఈమేరకు ఆమె మృతదేహం వద్ద సీపీఎం జిల్లా, మండల కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, నండ్ర ప్రసాద్ నివాళులర్పించారు. ఈ ప్రాంతంలో పేదల సమస్యలపై పోరాడిన పెద్దపుల్లమ్మ సేవలు మరువలేనివని తెలిపారు. నాయకులు వేగినాటి వెంకటనారాయణ, చావా నాగేశ్వరరావు, సూరిబాబు, పి.సత్యనారాయణ, ఏపూరి వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని రెండు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఖమ్మం వన్‌టౌన్, త్రీ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలుకు చెందిన కొంపల్లి శేఖర్(48) సుతారీ పనిచేస్తుండగా, భార్య శ్రీలతతో గొడవ పడేవాడు. ఆయన ఈనెల 1వ తేదీన ఖమ్మం మేదర్‌బజార్‌లో భార్యతో గొడవ పడి తల్లి వద్దకు వచ్చాడు. అక్కడ ఎలుకల మందు తాగిన శేఖర్‌ను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అలాగే, ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో బండారి సంపత్‌కుమార్(39) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య హైమావతి, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. ఆయన మద్యానికి బానిస కావటంతో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఇదేక్రమంలో ఆదివారం రాత్రి కూడా మద్యం తాగి రావడంతో భార్యతో గొడవ జరగగా.. అందరూ నిద్రించాక బయటకు వెళ్లిపోయాడు. అర్ధరాత్రి తర్వాత గుర్తించిన కుటుంబీకులు వెతకగా ఇంటి బయట ఉరి వేసుకుని ఉండడంతో ఇంటి యజమాని సాయంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు.

వ్యాన్‌ను ఢీకొట్టిన రాజధాని బస్సు

హెల్పర్, ఓ ప్రయాణికురాలికి గాయాలు



ఘటనాస్థలిలో రాజధాని బస్సు, వ్యాన్

సత్తుపల్లి: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో రోడ్డు పక్కన ఆగిన డీసీఎం వ్యాన్‌ను రాజధాని ఏసీ బస్సు ఢీకొట్టింది. సత్తుపల్లి మండలం తాళ్లమడ వద్ద సోమవారం చోటు చేసుకున్న ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం డిపోకు చెందిన రాజధాని ఏసీ బస్సు 30 మంది ప్రయాణికులతో విశాఖపట్నంకు వెళ్తోంది. ఈ క్రమంలో సత్తుపల్లి మండలం తాళ్లమడ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఆగి ఉన్న డీసీఎం వ్యాన్‌ను ఢీకొట్టడంతో బస్సు ముందు భాగంగానుజ్జునుజ్జయింది. బస్సులో ప్రయాణిస్తున్న హెల్పర్ మహేష్, ప్రయాణికురాలు దుర్గకు గాయాలు కాగా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, ఈ ప్రమాదంతో ఆందోళనకు గురైన ప్రయాణికులు బస్సు అత్యవసర ద్వారం నుంచి బయటకు వచ్చారు. సీఐ టి.కిరణ్ సిబ్బందితో చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సాక్షి
ఫ్యామిలీ
ఖమ్మం
మంగళవారం ॥ 7-5-2024



కన్యాకుమారిలో సృష్టి బక్షి పాదయాత్ర మొదలుపెట్టినప్పటి చిత్రం

డాక్యుమెంటరీ



తమిళనాడులోని ఒక బామ్మతో మాట్లాడుతూ...

కలిసి నడిచే గొంతులు

కన్యాకుమారి నుంచి శ్రీ నగర్ వరకూ 260 రోజుల పాటు 3,800 కిలోమీటర్లు దేశమంతా నడిచింది సృష్టి బక్షి. ఎందుకు? స్త్రీలపై జరిగే దురాగతాలపై చైతన్యం కలిగించడానికే కాదు స్త్రీల శక్తియుక్తులను వారికి గుర్తు చేయడానికి. ఆ సుదీర్ఘ ప్రయాణం ఇప్పుడు 'విమెన్ ఆఫ్ మై బిలియన్' పేరుతో అమెజాన్‌లో స్ట్రీమ్ అవుతోంది. నటి ప్రియాంకా చోప్రా నిర్మాత.

తాను నడిచి చేరుకున్న ఊరిలో ఏదైనా స్కూల్‌లోగాని, పబ్లిక్ హాల్‌లో కాని మహిళలను పోగు చేస్తుంది సృష్టి బక్షి. 'అందరూ కళ్లు మూసుకుని దీర్ఘంగా శ్వాస పీల్చి వదలండి' అంటుంది. 'ఇప్పుడు మీ కళ్ల ఎదురుగా మీ 11 ఏళ్ల వయసున్న మీ రూపాన్ని గుర్తు చేసుకోండి. ఆ 11 ఏళ్ల అమ్మాయిలో ఉండే విశ్వాసం, ఆనందం ఎన్ని విధాలుగా ధ్వంసమైందో గుర్తుకు తెచ్చుకోండి. ఆ అమ్మాయికి సారీ చెప్పండి. ఎందుకంటే ఆ విధ్వంసమంతా మీ అనుమతితోనే జరిగింది' అంటుంది. చాలామంది ఆ మాటలకు ఏడుస్తారు. గడిచివచ్చిన జీవితాన్ని తలుచుకుని బాధలో మునిగిపోతారు. అప్పుడు సృష్టి బక్షి ఒక బోర్డు మీద స్త్రీ శరీర నిర్మాణం గీచి 'ఇదిగో ఈ అవయవాల రీత్యా మీరు మగవారి కంటే భిన్నంగా పుట్టారు. ప్రకృతి ఈ అవయవాలను మీకు ఇస్తే సమాజం అదుపు, ఆంక్షలు, వివక్ష, కుటుంబ హింస, ఆర్థిక బానిసత్వం, ఇంటి పని... ఇన్ని ఇచ్చింది. మనం ఎందుకు మగవారితో సమానం కాము?' అని ప్రశ్నిస్తుంది.

మార్పు కోసం

సృష్టి బక్షిది ముంబై. ఆమె హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో చదువుకుంది. హాంగ్‌కాంగ్‌లో మార్కెటింగ్‌లో పెద్ద సంస్థల్లో పని చేసింది. తండ్రి ఆర్మీలో పని చేయడం వల్ల ఆమెకు దేశం పట్ల ఒక ఉద్వేగం ఉండేది. అయితే తాను ప్రేమించే దేశంలో స్త్రీలపై జరిగే అన్యాయాలను చూసి చలించి పోయేది. '2017లో హాంకాంగ్‌లో సిటీ బస్ ఎక్కి ఇంటికి వెళుతున్నప్పుడు నా ఫోన్‌లో ఇండియాలో తల్లీ కూతుళ్లపై తండ్రి ఎదుటే అత్యాచారం చేసి చంపేశారన్న వార్త చదివాను. చాలా నిస్పృహ కలిగింది. నాలాంటి వాళ్లు సౌకర్యంగా పడక్కుర్చీలో కూచుని చింతించడం సరికాదని రంగంలో దిగాలని అనుకున్నాను. అలా నా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, ఇండియా వచ్చి దేశంలోని స్త్రీలందరితో మాట్లాడాలని 2018 మే నెలలో పాదయాత్ర ప్రారంభించాను' అని చెప్పింది సృష్టి.

రోజూ వేలాది మంది

'ఉమెన్ ఆఫ్ మై బిలియన్' పేరుతో సృష్టి బక్షి మే 2018లో కన్యాకుమారి నుంచి పాదయాత్ర ప్రారంభించింది. ఈ యాత్ర రికార్డు అయ్యేలా టీమ్‌ను ఏర్పాటు చేసుకుంది. 260 రోజుల పాటు దాదాపు 4 వేల కిలోమీటర్ల పాటు సాగే ఈ యాత్రకు కోటి రూపాయలు ఖర్చవుతాయి. 50 లక్షలను క్రౌడ్ ఫండింగ్ ద్వారా పోగు చేసింది.

'ఈ యాత్రలో స్త్రీల కలలు, ఆకాంక్షలు, వారి హక్కులు, సంఘర్షణలు. విజయాలు వినదలుచుకున్నాను. వారు ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటున్నారో తెలుసుకోవాలనుకున్నాను. నా సుదీర్ఘ యాత్రలో మన దేశంలో వరకట్నం ఇంకా పెద్ద సమస్యగా ఉందని అర్థమైంది. వరకట్నం స్త్రీలను మానసికంగా పురుషులతో సమానం అనుకోనివ్వడం లేదు. స్త్రీలను అసభ్యంగా తాకడం, హింసించడం, అణిచి పెట్టడం కొనసాగుతూనే ఉంది. ఒక దశలో నేను యాత్ర చేయలేననుకున్నాను. కాని ఆ మరుసటి రోజు నా మీటింగ్‌కు హాజరైన ఒక ఆశా వర్కర్– ''రాత్రి నన్ను నా భర్త కొట్టాడు. నీ మాటలు విన్నాక ఇక ఇలాంటిది జరగనివ్వకూడదని నిశ్చయించుకున్నాను. నేను నా భర్తను నిలువరించడానికి నలుగురి సాయం తీసుకుంటాను'' అని చెప్పింది. నా యాత్ర వల్ల జరుగుతున్న మేలు అర్థమయ్యాక కొనసాగాను' అని తెలిపింది సృష్టి.

డాక్యుమెంటరీ విడుదల

సృష్టి చేసిన యాత్ర అంతా 'విమెన్ ఆఫ్ మై బిలియన్' పేరుతో డాక్యుమెంటరీగా రూపొందింది. మే 3 నుంచి అమెజాన్‌లో స్ట్రీమ్ అవుతోంది. ఈ డాక్యుమెంటరీ మీద మంచి రివ్యూలు వస్తున్నాయి. 'ఎందరో స్త్రీలు. వారి జీవితానుభవాలను ఈ డాక్యుమెంటరీలో పంచుకున్నారు. వారు సమస్యలు వారి తెచ్చుకున్నవి కాదు. వారికి తెచ్చిపెట్టినవి. అందుకే నటి ప్రియాంకా చోప్రా నా డాక్యుమెంటరీని చూసి తాను నిర్మాతగా మారి విడుదల చేయడానికి ముందుకు వచ్చారు. ఒక స్త్రీగా, ఆడపిల్ల తల్లిగా ఆమెకు స్త్రీల సాధికారత, ఆత్మగౌరవం గురించి అక్కర ఉంది. జెండర్ ఈక్వాలిటీ గురించి స్త్రీ, పురుషుల్లో చైతన్యం రావడానికి ఈ డాక్యుమెంటరీ ఉపయోగపడుతుందని ఆమె విశ్వసిస్తున్నారు' అని తెలిపింది సృష్టి బక్షి.

కళను రాశి పోస్తోంది!





రాశి అగర్వాల్

ఒక తావు పేపర్ తయారు కావాలంటే పది లీటర్ల నీళ్లు కావాల్సి వస్తుంది. రాసుకోవడానికి ఒక రీము పేపర్ సిద్ధం అవ్వాలంటే పాతికేళ్లు పెరిగిన చెట్టు కొమ్మలను సమూలంగా నరకాలి. చెట్టును నరక్కుండా, నీటిని వృథా చేయకుండా ఒక డైరీ తయారయితే? అంతకంటే ఇంకేం కావాలి? ఇంతే కాదు, టెక్స్‌టైల్ ఇండస్ట్రీ వృథాను హరాయించుకోవడానికి భూమాత పడే యాతన కూడా తగ్గిపోతుంది. ఇలాంటి వినూత్న ప్రయత్నానికి తెర తీసింది సూరత్‌లో ఓ ఆర్కిటెక్ట్. స్టేషనరీ వస్తువులు, ఇంటీరియర్ డెకరేషన్‌ని కలగలుపుతూ చేసిన ప్రయోగమే రుహానీ రంగ్. ఆ ప్రయోగం వెనుక దాగిన నేపథ్యాన్ని వివరించింది రాశి అగర్వాల్. ఆమె మదిలో వెలిగిన ఈ ఆలోచన తొమ్మిది వేల కిలోల పత్తికి పుస్తక రూపాన్నిచ్చింది.

మనదేశంలో కళ ఉంది!

''నేను ఆర్కిటెక్చర్ ఫైనలియర్‌లో ఉన్నప్పుడు మన సంప్రదాయ నిర్మాణాలు, కళలు, చేతివృత్తుల అధ్యయనం కోసం విస్తృతంగా పర్యటించాను. ఢిల్లీ నుంచి జైపూర్, అహ్మదాబాద్, కచ్, పాండిచ్చేరి నుంచి పూనా వరకు పరిశీలిస్తే మనదేశంలో రకరకాల కళలు, కళా నైపుణ్యాలున్న పని వాళ్లున్నారని తెలిసింది. వాళ్ల చేతుల్లో ఉన్న ప్రతిభను ప్రదర్శించే వేదికలు తగినంతగా లేవు. అలాంటి ఒక వేదికను ఏర్పాటు చేసి, నా వృత్తిలో ఇంటీరియర్ డిజైనింగ్‌కు దోహదం చేసే విధంగా ఒక ప్రయోగం చేశాను. అది విజయవంతమైంది. రకరకాల కళలను ఒక వేదిక మీదకు తీసుకురావాలనే ఉద్దేశంతో 'రుహానీ రంగ్' పేరుతో ఆర్ట్ స్టార్టప్ మొదలు పెట్టాను. ప్లానర్ బుక్ కవర్ పేజీ మీద మధుబని ఆర్ట్ ఉంటే ఇంట్లో అందమైన షో పీస్ ఉన్నట్లే. ప్లానర్ బుక్‌ని కార్నర్ స్టాండ్‌లో అందంగా అమరిస్తే డ్రాయింగ్ రూమ్ కళాత్మకంగా ఉంటుంది. ఇలాంటి ఎన్నో హస్త కళలను పునరుద్ధరించగలుగుతున్నాను.



రుహానీ రంగ్‌ను ఐదు వేల రూపాయలతో మొదలు పెట్టాను. నాతో కలిసి 50 మంది కళాకారులు, 40 మంది ఇతర ఉద్యోగులు పని చేస్తున్నారు. వస్త్రాలను తయారు చేసే భారీ పరిశ్రమలకు పెద్ద సంఖ్యలో పత్తి బేళ్లు వస్తుంటాయి. ప్రతి బేలులోనూ మెషీన్‌లో అమరికకు తగినట్లు ఉపయోగించగా మిగిలిన పత్తి వృథా అవుతూ ఉంటుంది. అది భూమిలో కలిసి పోవాల్సిందే తప్ప మరో పనికి ఉపయోగించేవారు కాదు. ఎందుకూ పనికి రాదని వదిలేస్తున్న ఆ పత్తే నా కుటీర పరిశ్రమకు ముడిసరుకు. నాకు కోవిడ్ సమయం కూడా మంచే చేసింది. ఆ టైమ్‌లో పెద్ద చిన్న పరిశ్రమలన్నీ మూత పడ్డాయి. హస్తకళాకారులు పని లేక ఆర్థికంగా మానసికంగా దెబ్బతిని ఉన్నారు. ఆ సమయంలో నేను ఒక్కొక్కరిని కలిసి నా ఆలోచన చెప్పంటే వాళ్లు ఉత్సాహంగా నాకు మరికొన్ని ఐడియాలు చెప్తూ తమ అనుభవాన్ని జోడించారు. అలా 2020లో మొదలు పెట్టిన నా కుటీర పరిశ్రమ ఇంత వరకు హ్యాండ్ మేడ్ పేపర్‌తో ప్లానర్స్, క్యాలెండర్‌లు, నోట్‌బుక్స్, జర్నల్స్, స్కెచ్ బుక్స్ వంటి 15 వేల ఉత్పత్తులకు రూపమిచ్చింది. వాటిని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే నలభై వేల ఫాలోవర్స్‌ను తెచ్చి పెట్టింది. ఆర్ట్ పీస్ కేవలం కళాభిరుచి, కళారాధన కోసమే కాదు. అది మన దైనందిన జీవితంలో భాగంగా మారాలి. అప్పుడే కళ ఎప్పటికీ నిలిచి ఉంటుంది'' అని వివరించింది రాశి అగర్వాల్.

సన్ బర్న్ ముప్పు!



- పండ్ల తోటలు, కూరగాయ తోటలకు ముప్పుగా మారిన ప్రచండమైన ఎండ
- అధిక ఉష్ణోగ్రతలతో పాటు తార స్థాయికి చేరిన లైట్ ఇంటెన్సిటీ, యు.వి. రేడియేషన్
- మామిడి, జామ కాయలు పక్వానికి రాక ముందే ఎర్రగా మారి రాలిపోవటం లేదా నాణ్యత కోల్పోతున్నాయని వాపోతున్న రైతులు
- రోజూ సాయంత్రం నీటిని, వారానికోసారి పోషకాలను చల్లమంటున్న 'ఆంగ్రూ' మాజీ డీన్ డా. పి.వి. రావు

ఈ వేసవిలో ఎల్‌నినో పుణ్యాన సాధారణం కన్నా ఐదారు డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ ఉద్యాన తోటలు సాగు చేసే రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ముఖ్యంగా సీజనల్ పండ్ల తోటలైన మామిడి, జామతో పాటు కూరగాయలు, డ్రాగన్ వంటి తోటలకు నిప్పుల కుంపటి వంటి వేడి ఒత్తిడి తీవ్ర సమస్యగా మారింది.

47 డిగ్రీలకు చేరిన పగటి గరిష్ట ఉష్ణోగ్రత వల్ల భూమి విపరీతంగా వేడెక్కి రాత్రి 7–8 గంటల వరకు సెగలు కక్కుతూ ఉంది. దీన్నే 'రిఫ్లెక్టెడ్ రేడియేషన్' అంటారు. పొలాల్లో కన్నా కాంక్రీటు అరణ్యాలుగా మారిన నగరాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. చెట్లు, మొక్కలు వేర్ల ద్వారా తీసుకునే నీటి కన్నా ఎక్కువగా నీరు ఆవిరైపోతుండటం వల్ల లేత ఆకుల చివర్లు ఎండిపోతున్నాయి. లేత కణాలు ఉంటాయి కాబట్టి లేత ఆకుల చివరలు మాడిపోతున్నాయి.

పగటి గరిష్ట ఉష్ణోగ్రత 25 నుంచి 35 డిగ్రీల సెల్షియస్ వరకు ఉన్న వాతావరణం పంటల పెరుగుదలకు అనుకూలంగా ఉంటుంది. 40 డిగ్రీలు దాటిన తర్వాత పంటలు, తోటలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇప్పుడు 47–48 డిగ్రీల సెల్షియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉండటంతో కూరగాయ పంటలు, పండ్ల తోటలు సన్ బర్న్‌తో సతమతమవుతూ ఉన్నాయని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం మాజీ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ పీవీ రావు 'సాక్షి సాగుబడి'తో చెప్పారు.

సాధారణంగా ఎండను రక్షణకు కొన్ని పంటలపై 50% సూర్యరశ్మిని ఆపే గ్రీన్ షేడ్‌నెట్‌ను వాడుతుంటారు. అయితే, ఉష్ణోగ్రతలు బాగా పెరిగిపోవటం వల్ల 80% ఎండను ఆపే గ్రీన్ షేడ్‌నెట్‌లు వేసుకోవాల్సి వస్తోందని డా. పివి రావు అన్నారు.



సన్‌బర్న్‌కు గురైన మామిడి కాయ



సన్‌బర్న్‌కు గురైన జామ కాయ



సన్‌బర్న్‌కు గురైన డ్రాగన్ పంట

అల్ఫాన్సో, పచ్చడి కాయలు 80% రాలిపోతున్నాయి



ఈ ఏడాది ఉష్ణోగ్రతలు చాలా ఎక్కువగా ఉండటం వల్ల అల్ఫాన్సో, దేశీ పచ్చడి రకాల చిన్న కాయలు రాలిపోతున్నాయి. ఆర్గానిక్ మామిడి తోటల్లో గతంలో 10-20% రాలే కాయలు ఈ సీజన్‌లో 70-80% రాలిపోతున్నాయి. ఇతర రకాల్లో కూడా జనవరిలో వచ్చిన ఆఖరి పూత ద్వారా వచ్చిన చిన్న కాయలు ఎక్కువగా ఎండదెబ్బకు రాలిపోతున్నాయి. ఎండలు ముదిరే నాటికి నిమ్మ కాయ సైజు ఉన్న కాయలకు ప్రాబ్లం లేదు. సన్‌బర్న్ సమస్య వల్ల కాయలు ఒకవైపు అకాలంగా రంగు మారిపోతుంటే, వెనుక వైపు మాత్రం పచ్చిగానే ఉంటున్నాయి. బంగనిపల్లి పూత రాలిపోవటంతో ఈ ఏడాది 20% కూడా కాయ మిగల్లేదు. దశేరి కాపు మాత్రం అన్నిచోట్లా బాగుంది. మామిడి చెట్లకు రోజూ నీరు స్ప్రే చేస్తున్నాం. చెట్ల కింద మల్చింగ్ చేసి నీటి తేమ ఆరిపోకుండా కాపాడుకుంటున్నాం. ఇదిలా ఉంటే, మధ్యప్రాచ్య దేశాల్లో యుద్ధం వల్ల నౌకల్లో వెళ్లే సరుకు విమానాల ద్వారా ఎగుమతి అవుతోంది. దీనికితోడు, దుబాయ్‌లో భారీ వరదల వల్ల అమెరికా తదితర దేశాలకు మామిడి పండ్ల ఎగుమతి ఈ ఏడాది బాగా దెబ్బతింది. గత 15 రోజుల్లో 350 ఎమిరేట్స్ విమానాలు రద్దయ్యాయి. దీంతో ఖతర్ తదితర దేశాల విమానాలు ధరలు పెంచేశాయి. అమెరికాకు కిలో మామిడి రవాణా చార్జీ రూ. 180 నుంచి 600కు పెరిగిపోయింది. అమెరికాలో 4 కిలోల మామిడి పండ్ల బాక్స్ గతంలో 40 డాలర్లకు అమ్మేవాళం. ఇప్పుడు 60-70 డాలర్లకు అమ్మాల్సివస్తోంది. దీంతో అమెరికాకు మామిడి ఎగుమతులు బాగా తగ్గిపోయాయి.

– **రఫీ** (98480 02221), సేంద్రియ మామిడి రైతు, ఎగుమతిదారు, ఏఆర్4మ్యాంగోస్, హైదరాబాద్

సూర్యకాంతి తీవ్రత

పంటలపై ప్రతికూల ప్రభావం ఎంతగా ఉందన్నది ఉష్ణోగ్రతతో పాటు సూర్యకాంతి తీవ్రత (లైట్ ఇంటెన్సిటీ)పై కూడా ఆధారపడి ఉంటుందని డా. రావు వివరించారు. సాధారణ ఉష్ణోగ్రతలు ఉన్న రోజుల్లో చదరపు మీటరుకు 20,000 – 25,000 కిలో లక్స్ వరకు సూర్యకాంతి ఉంటుంది. వేసవిలో సాధారణంగా ఇది 80,000 కిలో లక్స్‌కు పెరుగుతూ ఉంటుంది. అయితే, ఈ ఏడాది ఇది విపరీతంగా పెరిగి, ఏకంగా 1,20,000 కిలో లక్స్‌కు చేరటం పండ్ల తోటలకు, కూరగాయల పంటలకు ముప్పుగా మారిందని డాక్టర్ పి వి రావు తెలిపారు.

ఫొటో ఆక్సిడేషన్ వల్ల ఆకులలో కిరణజన్య సంయోగ క్రియ సజావుగా జరగటం లేదు. లేత ఆకుల్లో క్లోరోఫిల్ మాలిక్యూల్ చిట్లిపోవటం వల్ల ఆకుపచ్చగా ఉండాల్సిన ఆకులు జీవం కోల్పోయి పసుపు రంగుకు మారి ఎండిపోతున్నాయన్నారు.

సాగుబడి
కృత్తిక కార్తె : మే 11 నుంచి

తారస్థాయికి చేరిన యువి రేడియేషన్

అతినీలలోహిత కిరణాల (యువి) రేడియేషన్ సూచిక సాధారణంగా 3–4 వరకు ఉంటుంది. వేసవిలో ఈ సూచిక 8–9 వరకు పెరుగుతుంది. అయితే, ఈ ఏడాది మాత్రం ఇది 12కు పెరగటంతో సూర్యరశ్మిని పంటలు, తోటలు తట్టుకోలేకుండా ఉన్నాయని డా. పి వి రావు వివరించారు. మామిడి, జామ తదితర కాయలు ఎండ పడిన చోట ఎర్రగా మారి దెబ్బతింటున్నాయి. వెనుక వైపు పచ్చిగానే ఉంటూ ఎండ సోకిన దగ్గర రంగు మారుతుండటంతో పండ్లు నాణ్యతను కోల్పోతున్నాయి. అల్ఫాన్సో, పచ్చడి రకాల మామిడి కాయలు బాగా రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

నీరు, పోషకాలు పిచికారీ చేయాలి



విపరీత ఉష్ణోగ్రతలకు తోడైన వడగాడ్పులకు కూరగాయ తోటలు, పండ్ల తోటల్లో లేత ఆకులు మాడిపోతున్నాయి. ఉష్ణోగ్రత, అతినీలలోహిత వికిరణాలతో పాటు సూర్యరశ్మి తీవ్రత చాలా పెరిగిపోయింది. ప్రతి రోజూ సాయంత్రం 3 గంటల తర్వాత నీటిని పిచికారీ చేయటం ద్వారా పంటలకు రక్షించుకోవచ్చు. వారం, పది రోజులకోసారి ఇంటిపంటలపై నానో యూరియా/వర్మీవాష్/జీవామృతం/ఆవు మూత్రంను ఒకటికి పది (1:10) పాళ్లలో నీటిలో కలిపి పిచికారీ చేసుకొని, అతి వేడి వత్తిడి నుంచి తోటలకు ఉపశమనం కలిగించాలి.

– **డాక్టర్ పి.వి. రావు** (94901 92672), రిటైర్డ్ డీన్ ఆఫ్ అగ్రికల్చర్, ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ అధ్యక్షులు, హైదరాబాద్

యు.వి. రేడియేషన్ పండ్లను దెబ్బతీస్తోంది!

అతి నీలలోహిత వికిరణాల (యు.వి. రేడియేషన్) తీవ్రత బాగా పెరిగిపోయి మామిడి, జామ పండ్లు ఎండదెబ్బకు గురవుతున్నాయి. యు.వి. రేడియేషన్ ఏప్రిల్ ఆఖరి, మే మొదటి వారాల్లో తీవ్రస్థాయికి చేరింది. యు.వి. ఇండెక్స్ ఇప్పుడు 12-13కి పెరిగిపోయింది. మామిడి, జామ వంటి పండ్ల తోటల్లో కాయలపై ఎండ మచ్చలు ఏర్పడుతూ పండ్ల నాణ్యతను తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయి. టొమాటోలు వంటి కూరగాయలపై కూడా ఈ ఎండ మచ్చలు సమస్యగా మారాయి. ఎండ తగిలిన వైపు పండినట్లు రంగు మారుతుంది. వెనుకవైపు పచ్చిగానే ఉంటుంది. నాణ్యత కోల్పోయిన ఈ కాయలను కొయ్యలేక, చెట్లకు ఉంచలేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధిక వేడికి అనేక పోషకాలు అందక కొన్ని కాయలు రాలిపోతున్నాయి. యు.వి. రేడియేషన్ ఉద్యాన తోటల రైతులను ఈ ఏడాది చాలా నష్టపరుస్తోంది. నత్రజని కోసం ఫిష్ అమినో యాసిడ్ లేదా పంచగవ్యలను ద్రవజీవామృతంతో కలిపి చల్లాలి. బోరాన్ కోసం జిల్లేడు+ఉమ్మెత్త కషాయం, పొటాష్ కోసం అరటి పండ్ల (తొక్కలతో కలిపి తయారు చేసిన) కషాయాన్ని పిచికారీ చేయాలి.

– **ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం రాజు** (76598 55588), తెలంగాణా గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం

పోషకాలు, హార్మోన్ అసమతుల్యత

వేసవిలో టొమాటో, మిర్చి వంటి కూరగాయ పంటల మొక్కలు నాటుకునేటప్పుడు వీటికి ఉత్తర, దక్షిణ వైపున నీడనిచ్చే మొక్కలను వేసుకుంటే ఎండ బారి నుంచి కొంత మేరకు కాపాడుకోవచ్చు. ఉదాహరణకు.. టొమాటో మొక్కలు ఉత్తర దక్షిణాల్లో మొక్కజొన్న లేదా ఆముదం మొక్కలు వత్తుకోవాలి. వడగాలుల నుంచి పంటలను రక్షించుకోవటానికి పొలం సరిహద్దుల్లో విండ్ బ్రేకర్‌గా పనికొచ్చే ఎత్తయిన చెట్లు పెంచుకోవాలి. ఈ ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్న వారి తోటలు ఉపశమనం పొందుతాయి.

దాదాపు మరో నెల రోజులు మండే ఎండలు కొనసాగే పరిస్థితి ఉండటంతో తోటలకు చాలినంతగా నీటి తడులు ఇవ్వటంతో పాటు, చెట్లపైన కూడా సాయంత్రం 3 గంటల తర్వాత నీటిని పిచికారీ చేయాలి. వాతావరణంలో వేడి పెరిగే కొద్దీ నేల నుంచి వేర్ల ద్వారా పోషకాలను తీసుకునే సామర్థ్యం తగ్గుతుందని, అందుకు తగినట్లు నీరు, పోషకాలు సైతం అందిస్తే తోటలకు ఉపశమనం కలుగుతుందని డాక్టర్ పివి రావు సూచిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల కాలంలో పంటలు పోషకాలను నేల నుంచి తీసుకోవటంలో ఇబ్బంది వస్తుంది. జింక్ లోపం ఏర్పడుతుంది. హార్మోన్లను కూడా చెట్లు, మొక్కలు తయారు చేసుకోలేవు. హార్మోన్ అసమతుల్యత ఏర్పడుతుంది.

ఎండ తీవ్రతకు రెస్పిరేషన్ రేటు ఎక్కువ అవటం వల్ల కిరణజన్య సంయోగ క్రియ ద్వారా తయారయ్యే పిండి పదార్థం మొక్క/చెట్టు నిర్వహణకే సరిపోతాయి. పెరుగుదల లోపిస్తుంది. అదనపు పిండిపదార్థం అందుబాటులో వుండక పూలకు, కాయలకు పోషకాలను అందించలేని సంక్షోభ స్థితి నెలకొంటుంది. అందువల్ల పూలు, కాయలు రాలి పోయే పరిస్థితి ఎదురవుతుంది.



టొమాటో పంటకు షేడ్‌నెట్

అతి వేడి వత్తిడి ఎదుర్కొంటున్న మామిడి తోటలపై జింక్, ప్లానోఫిక్స్, బోరాన్‌లను సాయంత్రం 3 గంటల తర్వాత పిచికారీ చేయాలి. టొమాటో, మిరప, వంగ తదితర కూరగాయ మొక్కలపైన నాప్థలిన్ అసిటిక్ యాసిడ్‌ను 5 లీటర్ల నీటికి 1.5 నుంచి 2 ఎం.ఎల్. మోతాదులో కలిపి పిచికారీ చేయాలని డా. రావు తెలిపారు.

సేంద్రియ సేద్యం, వ్యాపార నైపుణ్యాలపై 6 రోజుల శిక్షణా శిబిరం

తెలుగు రాష్ట్రాలకు చెందిన ఔత్సాహికులను సేంద్రియ వ్యవసాయంలో మెళకువలు నేర్పటంతో పాటు.. సేంద్రియ ఆహారోత్పత్తుల వ్యాపార అవకాశాలను సృష్టించటంలో నిపుణులైన ఫెసిలిటేటర్‌గా మారడానికి నైపుణ్యం, విజ్ఞానాభివృద్ధి శిక్షణా కోర్సును నిర్వహించనుంది కృష్ణ సుధా అకాడమీ ఫర్ అగ్రోఎకాలజీ. 20 ఏళ్లుగా సేంద్రియ వ్యవసాయ శిక్షణలో విశేష కృషి చేస్తున్న సుస్థిర వ్యవసాయ కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జీవీ రామాంజనేయులు సారథ్యంలో నూజివీడుకు సమీపంలోని కొండపర్వలో సకల వసతులతో కృష్ణ సుధా అకాడమీ ఫర్ అగ్రోఎకాలజీ అంతర్జాతీయ స్థాయి వసతులతో ఇటీవలే ప్రారంభమైంది. సేంద్రియ వ్యవసాయంలో క్షేత్రస్థాయిలో లోతైన పరిశోధనలు చేయటంతో పాటు సేంద్రియ వ్యవసాయం, వ్యాపారం తదితర అంశాలపై ప్రామాణికమైన శిక్షణ ఇవ్వటమే ఈ అకాడమీ లక్ష్యంగా పెట్టుకుంది. అగ్రికల్చర్ స్కిల్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా తదితర సంస్థల తోడ్పాటుతో మే 22 నుంచి 27 వరకు తెలుగులో నిర్వహించనున్న ఉచిత రెసిడెన్షియల్ శిక్షణా శిబిరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డా. రామాంజనేయులు తెలిపారు. గుగుల్ ఫామ్ ద్వారా అభ్యర్థులు విధిగా ముందుగా పేర్లు నమోదు చేసుకోవటం తప్పనిసరి. 30–35 మందికి మాత్రమే అవకాశం.

ఇతర వివరాలకు.. 85002 83300.
www.krishnasudhaacademy.org

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్

క్లుప్తంగా...

పంట నష్ట పరిహారం నిధులు విడుదల

రూ. 15 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. గత మార్చి 16 నుంచి 21 మధ్య కాలంలో పది జిల్లాల్లో భారీ వర్షాలు, వడగండ్ల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు నష్ట పరిహారాన్ని మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. రూ. 15.81 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపింది. ఇన్‌పుట్ సబ్సిడీని ఆధార్‌తో అనుసంధానం చేసిన రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తారు. 90 రోజుల వ్యవధిలో చెల్లింపులు పూర్తి చేస్తారు. ప్రతి రైతు ఒక వ్యవసాయ సీజన్‌లో ఒక విపత్తుకు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీకి అర్హులని ప్రభుత్వం ప్రకటించింది. నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ లభించేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. జిల్లాల వారీగా పంపిణీ వివరాలను ప్రభుత్వానికి అందజేయాలని వ్యవసాయ కమిషనర్‌ను ఆదేశించింది.

హత్యాయత్నాన్ని ఖండించిన వైద్య సంఘాలు

సాక్షి, హైదరాబాద్: కోరుట్ల ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బందిని రోగి బంధువులు గదిలో బంధించి వారిపై పెట్రోల్ పోసి హత్యాప్రయత్నం చేయడంపై వైద్యులు, వైద్య సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బందిపై దాడి చేయడమే కాకుండా ఆసుపత్రిలో ఫర్నిచర్ ధ్వంసం చేసిన రోగి బంధువులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర కోర్ కమిటీ సోమవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇలాంటి ఘటనల వల్ల వైద్యులు, సిబ్బంది ఆత్మస్థైర్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేసింది. కోరుట్ల ఘటనను హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్, తెలంగాణ నర్సుల అసోసియేషన్ (టీఎన్ఏ) తీవ్రంగా ఖండించాయి. వైద్యులు ఎప్పుడూ రోగి ప్రాణాలను కాపాడటానికే ప్రయత్నిస్తారని అటువంటి వైద్యులపై దాడులు చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీ–జూడా) డిమాండ్ చేసింది.

వడదెబ్బకు ముగ్గురు మృతి

శంకరపట్నం, రామన్నపేట: వడదెబ్బకు గురై సోమవారం కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నానికి చెందిన పంజాల భారతి(56), తాడికల్ గ్రామానికి చెందిన చామంతుల మల్లయ్య(80), యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన పున్న కామేశ్వరమ్మ(70) మృతి చెందారు.

యాసంగి ధాన్యం సేకరణ అంతంతే!

కొనుగోళ్లు మొదలై నెల దాటినా సేకరించింది 22 లక్షల మెట్రిక్ టన్నులే

- లక్ష్యం 75 ఎల్ఎంటీ.. కానీ 40 ఎల్ఎంటీ కూడా కష్టమే: అధికారులు
- ప్రైవేటు వ్యాపారులు నేరుగా రైతుల నుంచి ధాన్యం కొంటుండటం వల్లే..!



సాక్షి, హైదరాబాద్: ఒకవైపు మండుతున్న ఎండలు... మరోవైపు అకాల వర్షాల నడుమ రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. నెల క్రితమే ధాన్యం సేకరణ మొదలైనప్పటికీ ఇప్పటివరకు 22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం సేకరించింది. గతేడాది కొనుగోళ్లతో పోలిస్తే ఇది ఎక్కువే అయినప్పటికీ గత సంవత్సరంకన్నా ముందే ఈసారి కోతలు జరగడంతో ధాన్యం సేకరణ మందగించింది. ఇప్పటికే ఉమ్మడి నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియ ముగింపు దశకు వచ్చింది. కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల్లోనూ 60 శాతానికిపైగా ధాన్యం సేకరణ పూర్తయింది. మహబూబ్‌నగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు ఆలస్యంగా మొదలయ్యాయి. రంగారెడ్డి, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో తక్కువ విస్తీర్ణంలో వరిసాగు చేయడంతో ఇక్కడ కొనుగోళ్లు నామమాత్రంగానే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో పౌరసరఫరాల శాఖ అంచనా వేసినట్లు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం లేదు. నిర్దేశించుకున్న లక్ష్యంలో సగం కూడా మార్కెట్‌కు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

4,804 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ

రాష్ట్రంలో హైదరాబాద్ మినహా వ్యవసాయం సాగే 32 జిల్లాల్లో సాగైన వరి పంట ఆధారంగా యాసంగిలో రైతుల నుంచి ధాన్యం సేకరణ 75.40 మెట్రిక్ టన్నులు ఉండొచ్చని పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. ఇందుకు అనుగుణంగా 7,210 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వాటిలో 7,154 కేంద్రాలను రాష్ట్రంలో తెరిచినప్పటికీ వాటిలో 4,804 కేంద్రాల్లోనే ప్రస్తుతం కొనుగోళ్లు సాగుతున్నాయి. వాటి ద్వారా ఇప్పటివరకు 22.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 3.51 లక్షల రైతుల నుంచి పౌరసరఫరాల సంస్థ సేకరించి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం రైస్‌మిల్లులకు పంపించింది. అత్యధికంగా నిజామాబాద్, కామారెడ్డి, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ధాన్యం సేకరణ జరిగింది. ఆ తరువాత కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోనూ ఇప్పటికే చాలా వరకు ధాన్యాన్ని సేకరించారు. ఈ జిల్లాల నుంచి ఇక తక్కువ ధాన్యమే కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంది.

ధాన్యం విలువ రూ. 4,875 కోట్లు

రాష్ట్రంలో ఇప్పటివరకు పౌరసరఫరాల సంస్థ సేకరించిన ధాన్యం విలువ రూ. 4,875.91 కోట్లు. అందులో రైతుల బ్యాంకు ఖాతాల్లోకి ఇప్పటికే రూ. 3,085.62 కోట్లు చేరాయి. మరో రూ. 1,790.29 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. అయితే ఈ మొత్తాన్ని రైతులు విక్రయించిన ధాన్యం వివరాలు ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఓపీఎంఎస్)లోకి చేరిన వెంటనే ఖాతాల్లో వేయనున్నట్లు పౌరసరఫరాల సంస్థ అధికారులు తెలిపారు.

తనిఖీల భయంతో మిల్లర్ల కొనుగోళ్లు..

మార్చి మూడో వారంలోనే ఉమ్మడి నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో వరి కోతలు మొదలవడంతో సన్న ధాన్యం కోసం వ్యాపారులు ఆ జిల్లాల్లోని రైతుల వద్దకు వచ్చి పచ్చి ధాన్యాన్నే కొనుగోలు చేశారు. దీంతో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభించాలనుకున్న ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం మార్చి 25 నుంచే ప్రారంభించింది. పౌరసరఫరాల సంస్థకు చెందిన ధాన్యాన్ని గతంలో అక్రమంగా విక్రయించిన మిల్లర్లు... నిల్వల తనఖీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వస్తుండటంతో రైతుల నుంచి అయినకాడికి కొనుగోలు చేసే కార్యక్రమం చేపట్టారు. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తీసుకురావడంలేదు. 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేయగా 40 లక్షల మెట్రిక్ టన్నులు కూడా వచ్చే అవకాశం లేదని అధికారులే అంటున్నారు.

3 రోజులు తేలికపాటి వానలు!

▶ మొదటి పేజీ తరువాయి

దక్షిణ తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోందని.. దాని ప్రభావంతో మంగళ, బుధ, గురు వారాల్లో ఉరు ములు, మెరుపులు, ఈదురు గాలులతో (గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో) కూడిన తేలిక పాటి వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలి పింది. కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకా శం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా.. కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్ద పల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జన గామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో మోస్తరు వానలు పడతాయని పేర్కొంది. వానలకు సంబంధించి ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలకు ఎల్లో అలర్ట్ ఇచ్చింది.

జిల్లులు పడినా ఎండల మంటలే..

రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిశాయి. దానితో ఆదివారం రాత్రి వాతావరణం కాస్త చల్లబడింది. అయినా సోమవారం ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదయ్యాయి. జగిత్యాల జిల్లా గుల్లకోట, అల్లిపూర్‌లో 46.8 డిగ్రీలు, పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.4 డిగ్రీల అత్యధిక గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 23 ప్రాంతాల్లో 45 డిగ్రీలకుపైనే నమోదైంది. వచ్చే మూడు రోజులు కూడా గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగానే నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.



ప్రధాన కేంద్రాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలివీ..

నిజామాబాద్	44.5
మెదక్	44.0
ఆదిలాబాద్	43.8
ఖమ్మం	43.5
రామగుండం	43.4
మహబూబ్‌నగర్	43.1
హనుమకొండ	43.0
భద్రాచలం	42.6
హైదరాబాద్	41.9
హకీంపేట్	41.9
దుండిగల్	41.8
నల్లగొండ	41.0

హాస్టళ్లలో వసతులపై నివేదిక ఇవ్వండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- పాఠశాలల్లోని పరిస్థితిపై కూడా..



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలు, వసతి గృహాల్లో మరుగుదొడ్లు సహా ఇతర మౌలిక వసతుల స్థితిగతులపై సమగ్ర నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. జూన్ 10 వరకు సమయం ఇస్తున్నామని స్పష్టం చేస్తూ, విచారణను వాయిదా వేసింది. ప్రభుత్వ హాస్టళ్లలో బాలల హక్కుల పరిరక్షణ కోసం జాతీయ కమిషన్–2018 నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు సౌకర్యాలు అందించడం లేదని, 10 మందికి ఓ బాత్రూమ్, ఏడుగురికి ఓ మరుగుదొడ్డి, 50 మందికో వార్డెన్ ఉండాలని చెబుతున్నా.. ఆ మేరకు సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పేర్కొంటూ హైదరాబాద్‌కు చెందిన కీర్తినేడి అఖిల్ శ్రీ గురుతేజ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. విద్యాహక్కు, బాలల హక్కుల వంటి పలు చట్టాలతో పాటు రాజ్యాంగ నిబంధనల ప్రకారం విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. అధికారులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

సెలవుల్లోగా వసతులు కల్పిస్తారన్న ఏఏజీ

ఇన్ని రోజులూ విద్యార్థులు హాస్టళ్లలో ఉండటంతో నిర్మాణాలు చేపట్టడానికి ఇబ్బందులు ఉండేవని ఏఏజీ వాదించారు. ఇప్పుడు సెలవులు రావడంతో విద్యార్థులు హాస్టళ్ల నుంచి వెళ్లిపోయారని.. వేసవి సెలవులు జూన్ 11న ముగియనున్నాయని చెప్పారు. ఈ సెలవుల కాలంలో పాఠశాలలు, హాస్టళ్లలో వసతులు కల్పిస్తామని తెలియజేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. నివేదిక అందజేయాలని ఆదేశిస్తూ, విచారణను జూన్ 10కి వాయిదా వేసింది.

పిటిషనర్లను భూమి నుంచి వెళ్లగొట్టొద్దు

- ఆర్ఆర్ఆర్ భూసేకరణలో ఎన్‌హెచ్ఏఐకి హైకోర్టు ఆదేశం
- ప్రక్రియను మాత్రం కొనసాగించుకోవచ్చని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగ్ రోడ్(ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగం నిర్మాణంలో భూమి కోల్పోతున్న పిటిషనర్లను తాము తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు భూమి నుంచి వెళ్లగొట్టొద్దని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ)ను హైకోర్టు ఆదేశించింది. అయితే ప్రక్రియను మాత్రం కొనసాగించుకోవచ్చని స్పష్టం చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను జూన్ 14కు వాయిదా వేసింది. ఆర్ఆర్ఆర్ నిర్మాణంలో భాగంగా మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామం సర్వే నంబర్ 375, 377, 336లోని 9.03 ఎకరాల భూమి మొత్తం పోతోందని శ్రీరాంరెడ్డి.. సిద్దిపేట్ జిల్లా గజ్వేల్ మండలం పాములపర్తి గ్రామంలో సర్వే నంబర్‌లో 263లో 14 ఎకరాలున్న కట్ల ఆరులప్ప హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు.

3ఏ, 3డీ నోటిఫికేషన్లు కొట్టివేయాలన్న పిటిషనర్లు

ఎన్‌హెచ్ 44, ఆర్ఆర్ఆర్ ఇంటర్ జంక్షన్‌ను దాదాపు 60 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. దీని కోసం ఎన్‌హెచ్ఏఐ 2022, మే 25న 3ఏ నోటిఫికేషన్.. 2023, ఆగస్టు 8న 3డీ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ నోటిఫికేషన్లను వారు సవాల్ చేశారు. దాదాపు 4,704.25 ఎకరాల్లో ఎన్‌హెచ్ఏఐ ఆర్ఆర్ఆర్ నిర్మాణం చేపట్టనుంది. ఇందులో దాదాపు 4,315.33 ఎకరాల ప్రైవేట్ భూమిని సేకరిస్తున్నారు. అంటే మొత్తం భూ సేకరణలో ప్రైవేట్ భూమి వాటా 91.73 శాతం.. ప్రభుత్వ భూమి 5 శాతం.. అటవీ భూమి 3.27 శాతం. ప్రైవేట్ భూమి శాతాన్ని తగ్గించే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం ఆ ఇతర మార్గాలవైపు దృష్టి సారించలేదని పిటిషనర్లు వివరించారు. ఈ పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ కాజా శరత్ విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది గౌరారం రాజశేఖర్‌రెడ్డి వాదనలు వినిపించారు. జాతీయ రహదారుల చట్టాన్ని పాటించడంలో పలు వ్యత్యాసాలు ఉన్నందున 3ఏ, 3డీ నోటిఫికేషన్‌ను కొట్టివేయాలని కోరారు.

పునరావాసం చట్టం అమలుకాదన్న ఎన్‌హెచ్ఏఐ

భూమి కోల్పోతున్న వారిని గుర్తించాలని, 3డీ నోటిఫికేషన్ కంటే ముందే రీహ్యాబిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్(ఆర్ఆర్) ప్యాకేజీ అమలు చేయాల్సి ఉందన్నారు. రోడ్డు ప్రాజెక్టులకు భూసేకరణ ఉపశమనం, పునరావాస చట్టం 2013 అమలు కాదని, ఆర్ఆర్ ప్యాకేజీను అమలు చేయాల్సిన అవసరం లేదని ఎన్‌హెచ్ఏఐ న్యాయవాది వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కేంద్ర రోడ్డు రవాణా శాఖ కార్యదర్శి, ఎన్‌హెచ్ఏఐ తదితరులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

జిల్లా వార్తలు

ఘనంగా కేవీకే స్వర్ణోత్సవాలు



మాట్లాడుతున్న హేమంత్‌కుమార్

వైరా: కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటై 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వైరా కేవీకేలో సోమవారం స్వర్ణోత్సవాల వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ డాక్టర్ స్వర్ణలత, అశ్వరావుపేట వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ జె.హేమంత్‌కుమార్ మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతులకు నూతన సాంకేతిక విధానాలు, వంగడాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. అలాగే, పంటల్లో సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆతర్వాత జిల్లా వ్యవసాయాధికారి పి.విజయనిర్మల, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి వేణుమనోహర్‌రావు మాట్లాడగా ఆర్ఈఏసీ సభ్యుడు టి.రాణాప్రతాప్, వైరా కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, డాక్టర్ జెస్సీ సునీత తదితరులు పాల్గొన్నారు

డిప్యూటీ సీఎం కారు తనిఖీ



కారులో తనిఖీ చేస్తున్న పోలీసులు

బోనకల్: మండల కేంద్రంలోని చెక్‌పోస్ట్ వద్ద డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కారును పోలీసులు తనిఖీ చేశారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి తరఫున ప్రచారానికి సోమవారం ఆయన వచ్చారు. ఈ మేరకు కారును పోలీసులు తనిఖీ చేయగా భట్టి సహకరించారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు జెట్టి కుసుమకుమార్ తదితరులు ఆ సమయాన డిప్యూటీ సీఎం వెంట ఉన్నారు.

మూగ జీవాలను రక్షించుకోవాలి..



- ఎండల నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలి
- ఉదయం, సాయింత్రం వేళల్లోనే మేతకు తీసుకెళ్లాలి
- పశుకాపరులు కూడా అప్రమత్తంగా ఉండాలి

ఖమ్మంవ్యవసాయం: ఎండలు నానాటికీ మండుతున్నాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయికి చేరాయి. మానవులతో పాటు పశుపక్షాదులు కూడా ఎండల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవటం అవసరం. ప్రస్తుతం రెడ్ అలర్ట్ అంచుల్లో ఉష్ణోగ్రతలు కొనసాగుతుండటంతో రాష్ట్ర పశు వైద్య, పశుసంవర్ధక శాఖ మూగజీవాల సంరక్షణపై పలు సూచనలు చేసింది. పశుపక్షాదులు వడదెబ్బకు, అనారోగ్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని సూచించించిది. ప్రస్తుతం జిల్లాలో 40 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో పశువులు, పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు వడదెబ్బకు, అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. పశుపక్షాదుల సంరక్షణలో వాతావరణానికి అనుగుణంగా శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటిస్తే వాటి ఉత్పాదక శక్తిని రక్షించుకునే అవకాశం ఉంది. పశు సంరక్షణలో యజమానులు, కాపరులు కూడా తమ ఆరోగ్య రక్షణ చర్యలు కూడా పాటించాల్సి ఉంటుంది. ఇటీవల ఖమ్మం జిల్లాలోని చింతకాని మండలంలో ఓ పశువుల కాపరి వడదెబ్బ కారణంగా మృత్యువాత పడిన ఘటన చోటు చేసుకుంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎండ తీవ్రత నేపథ్యంలో పశువుల సంరక్షణపై పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారులు సూచనలు చేస్తున్నారు.

పశుకాపరులకు సూచనలు

పశువుల యజమానులు, కాపరులు ఎండ తీవ్రత నుంచి రక్షించుకునేందుకు పలు జాగ్రత్తలు పాటించాలి. పశువులను మేతకు తరలించే క్రమంలో ఎండ తీవ్రత నుంచి రక్షించుకునేందుకు గొడుగును వినియోగించాలి. తలపాగా ధరించటం కూడా మంచిది. వెంట మంచినీటిని తీసుకువెళ్లాలి. పశువులు పచ్చిక బైళ్లలో మేసే సమయంలో కాపరులు చెట్ల నీడన ఉండాలి. ఆరోగ్య రక్షణ చర్యలు పాటించాలి.

పశువుల్లో వడదెబ్బ..

అధిక ఉష్ణోగ్రత, గాలి ప్రసరణ సరిగా లేకపోవటం, షెడ్లలో అధిక సంఖ్యలో కిక్కిరిసి పశువులను ఉంచటం, ఉక్కపోత, నీటి సౌకర్యం అందుబాటులో లేకపోవటం వలన పశువులు, జీవాలు వడదెబ్బకు గురవుతాయి. వడదెబ్బకు గురైన పశువులు నీరసించి, బలహీనంగా మారుతాయి. జీవక్రియ తగ్గిపోయి ఆకలి మందగిస్తుంది. ఆహారం తక్కువగా తీసుకోవటం వలన ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. వ్యాధి నిరోధక శక్తి కూడా తగ్గుతుంది. దీంతో వ్యాధుల బారిన పడతాయి. చూడి పశువులకు గర్భస్రావాలు సంభవించే ప్రమాదం కూడా ఉంటుంది.


సమయపాలన పాటించాలి..

వేసవిలో పశువుల జీర్ణక్రియ సన్నగిల్లుతుంది. జీర్ణించుకునే పిండి పదార్థాలు గంజి, జావ వంటి వాటిని ఆహారంగా ఇవ్వాలి. అధిక శాతం పచ్చిగడ్డిని ఇవ్వాలి. మాగుడు గడ్డిని కూడా ఇవ్వవచ్చు. పచ్చిగడ్డి ఉదయం, సాయింత్రం వేళల్లో, ఎండు గడ్డి రాత్రి సమయంలో ఇవ్వాలి. పాడి పశువులకు పశుదాణాను నీటితో కలిపి వ్వాలి. మినిరల్ మిక్చర్, ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వటం మంచిది. మేత కోసం ఎండవేళలో గాకుండా ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయింత్రం 5 నుంచి 7 గంటల వరకు పశువులను బయటకు తీసుకువెళ్లాలి.

ఆరోగ్య రక్షణ

వేసవి తాపానికి గురైన పశువులు వ్యాధి నిరోధక శక్తిని కోల్పోతాయి. దీంతో వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. ఇందుకోసం ఇదివరకు వేయించని పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. గాలికుంటు, గొంతువాపు, జబ్బవాపు వంటి వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. మురుగు నీరు తాగటంతో పారుడు వంటి జీర్ణకోశ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుంది. పశువులకు ఎల్లవేళల మంచి, చల్లని నీరు అందుబాటులో ఉంచాలి. వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే ప్రదేశంలోకి చేర్చి శరీర ఉష్ణోగ్రత తగ్గటం కోసం పలుసార్లు నీటితో కడగాలి. తల, నుదిటి మీద మంచుముక్కలు ఉంచాలి. లేదా చల్లని గోనే సంచిని కప్పాలి. పశువైద్యునిచే వైద్యం చేయించాలి. గ్లూకోజు, సెలైన్, సోడియం క్లోరైడ్ అందించాలి.

ఎండల బారి నుంచి రక్షించుకోవాలి



ఎండ తీవ్రత అధికంగా ఉంది. పశువులను రక్షించుకోవటంతో పాటు, యజమానులు, కాపరులు కూడా తగిన జాగ్రత్తలను పాటించాలి. వడదెబ్బకు గురిగాకుండా తగిన చర్యలు తీసుకోవాలి. కోళ్లకు కూడా యజమానులు తగిన రక్షణ చర్యలు పాటించాలి.

– డాక్టర్ బి వేణుమనోహర్‌రావు, పశుసంవర్ధక శాఖ జేడీ

హిందూ, ముస్లింలను వేరు చేస్తున్న బీజేపీ



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన మరో మంత్రి సీతక్క, అభ్యర్థి బలరాంనాయక్, ఎమ్మెల్యే కనకయ్య తదితరులు

- ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ దుకాణం బంద్
- ఎంపీగా బలరాంనాయక్‌ను గెలిపించాలి
- మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ధనసరి సీతక్క

కామేపల్లి: అన్నదమ్ములుగా కలిసిమెలిసి ఉంటున్న హిందూ, ముస్లింలను వేరు చేసేది బీజేపీ అని.. ఇక లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ మూతపడుతుందని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ధనసరి సీతక్క అన్నారు. కామేపల్లి మండలం కొత్త లింగాల క్రాస్ వద్ద మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ విజయాన్ని కాంక్షిస్తూ ఏర్పాటుచేసిన సభలో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ దేశంలో ఎక్కడికి వెళ్లినా కాంగ్రెస్ గాలి వీస్తోందని తెలిపారు. కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమ ఫలాలు అందుతాయని చెప్పారు. అయితే, ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రతిపక్షాలు చెప్పే అబద్ధాలను నమ్మకుండా ఆరు గ్యారంటీలను అమలుచేయనున్న కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ఉన్నా, లేకున్నా, ఆయన అబద్ధాలు ప్రచారం చేసినా.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతుభరోసా, రైతుబీమా, 24 గంటల విద్యుత్, 1వ తేదీన ఉద్యోగులు వేతనాలను అందిస్తుందని స్పష్టం చేశారు. సమాజ శ్రేయస్సు కోసం, పేదల పొట్ట కొట్టిన బీజేపీని అధికారంలోకి రానివ్వకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీకి తోడుగా నిలిచాయన్నారు. సోనియాగాంధీ ఆశీస్సులతో బలరాంనాయక్‌కు టికెట్ దక్కిందని.. లంబాడీ, ఆదివాసీలను అన్నదమ్ములా కలిసిమెలిసి ఉండే రాష్ట్రంలో గిరిజన బిడ్డను మొదటి స్థానంలో నిలపాలని కోరారు. త్వరలోనే సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి పంట పొలాలకు నీళ్లు అందిస్తామని మంత్రి ప్రకటించారు.

యోధుడిలా రాహుల్‌గాంధీ పోరాటం

దేశంలో పేదల పక్షాన నిలబడి యోధుడిలా పోరాడుతున్నది రాహుల్‌గాంధీ తప్ప మరెవరూ లేరని మంత్రి సీతక్క వెల్లడించారు. పోడు భూములకు హక్కు పత్రాలు, ఉపాధి హామీ పథకం, ఉద్యోగాలు, ఆహార భద్రత కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుని, ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు సాధించాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ప్రతీ అంశంలోనూ దేవుడిని తెరపైకి తీసుకొచ్చి బీజేపీ నేతలు.. అగరుబత్తీలపై పన్ను విధించిన విషయాన్ని గుర్తించాలని సూచించారు. కాగా, ఈ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పి బలరాంనాయక్‌ను గెలిపించడం ద్వారా కేంద్ర మంత్రిగా చేసుకుందామని సీతక్క తెలిపారు. అనంతరం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, అభ్యర్థి బలరాంనాయక్ మాట్లాడగా కామేపల్లి ఎంపీపీ బానోత్ సునీత తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, మండలాల అధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి, నాయకులు శ్రీచరణ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మేకల మల్లిబాబయాదవ్, ఏపూరి మహేందర్‌కుమార్, గుజ్జర్లపూడి రాంబాబు, నల్లమోతు లక్ష్మయ్య, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, రెడబోతు గోపీరెడ్డి, జర్పుల లక్ష్మణ్‌నాయక్, ఫగడాల మంజుల, ధరావత్ అనురాధ, లకావత్ సునీత, ఏపూరి హేమమాలిని, తోటకూరి శివయ్య, ఏపూరి లతాదేవి, దుగ్గి కృష్ణ, ఇంజం నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగికి జైలుశిక్ష

వరకట్న వేధింపుల కేసులో కోర్టు తీర్పు

కొత్తగూడెంటౌన్: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన మైసారపు వినయ్‌కుమార్(ఆర్మీ ఉద్యోగి)కు వరకట్న వేధింపుల కేసులో ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ కొత్తగూడెం మూడో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వాంకుడోతు శివనాయక్ సోమవారం తీర్పు చెప్పారు. పాల్వంచ బాంబే కాలనీకి చెందిన జ్యోతికి 2010 సెప్టెంబర్ 13న డోర్నకల్‌కు చెందిన మైసారపు వినయ్‌కుమార్‌తో వివాహం జరిగింది. ఆ సమయాన రూ.3.50 లక్షల కట్నం, రూ.50 వేలు ఇంటి సామగ్రి, మూడు తులాల బంగారం అందజేశారు. పెళ్లయ్యాక విజయవాడలోని కానూరులో రెండు నెలలు ఎలాంటి గొడవలు లేకుండా కాపురం సాగినా, జ్యోతి గర్భం దాల్చాక అదనపు కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేధించిన వినయ్, కత్తితో గాయపరిచాడు. ఇక ఏడో నెలలో పుట్టింటికి వచ్చిన జ్యోతికి కుమారుడు జన్మించాక చూడడానికి రాకపోగా, అదనపు కట్నం ఇవ్వకపోతే విడాకుల నోటీసు పంపిస్తానని ఫోన్‌లో బెదిరించాడు. ఆపై పెద్దమనుషులు సర్దిచెప్పడంతో తన భార్యను జమ్మూకశ్మీర్ తీసుకెళ్లిన వినయ్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. అక్కడ కూడా ఇష్టం వచ్చినట్లు కొడుతుండడంతో తిరిగి వచ్చేసిన జ్యోతి పాల్వంచ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం వినయ్‌కుమార్‌కు ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ లావణ్య వాదించగా, సిబ్బంది హరిగోపాల్, పునెం బాబు సహకరించారు.

తెలుగు అధ్యాపకుడికి డాక్టరేట్



కిరణ్‌కుమార్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇనపనూరి కిరణ్‌కుమార్‌కు డాక్టరేట్ లభించింది. 'ఖమ్మం జిల్లా కోలాటం పాటలు–పరిశీలన' అంశంపై ఆయన ఓయూ తెలుగు విభాగం విశ్రాంతాచార్యులు డాక్టర్ బూర్గుల కేశవులు పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటిచింది. ఈ సందర్భంగా కిరణ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకీరుల్లా, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ బీ.వీ.రెడ్డి టి.జీవన్‌కుమార్ తదితరులు అభినందించారు.